## భారతీయులకు అమెరికా షాక్..

హెచ్–1బీ వీసాతో అమెరికా వెళ్లాలనుకునేవారికి ఊహించని షాక్ తగిలింది. అమెరికా ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన సోషల్ మీడియా వెట్టింగ్ పాలసీ గందరగోళానికి దారి తీస్తోంది. ఈ విధానం వల్ల భారత్‌లో భారీ సంఖ్యలో వీసా అపాయింట్‌మెంట్లు వచ్చే ఏడాదికి వాయిదా పడ్డాయి. భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం దీనికి సంబంధించి ఎక్స్ వేదికగా ప్రకటన చేసింది. వీసా అపాయింట్‌మెంట్ షెడ్యూల్ చేసినట్లు మీకు ఈమెయిల్ వచ్చి ఉంటే, కొత్త తేదీలో మాత్రమే హాజరు కావాలని రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ఒకవేళ ఎవరైనా పాత తేదీలో ఇంటర్వ్యూ కోసం వస్తే వారిని కాన్సులేట్‌లోకి అనుమతించబోమని స్పష్టం చేసింది.ఇదిలా ఉండగా.. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 85 వేల వీసాలను అమెరికా రద్దు చేసింది. దీనిపై అమెరికా విదేశాంగ శాఖ తాజాగా సోషల్‌మీడియా వేదికగా ఒక ప్రకటన చేసింది. సరిహద్దు భద్రత, వలస పర్యవేక్షణకు తాము అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఈ ప్రకటన ద్వారా స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, విదేశాంగ కార్యదర్శి మార్క్ రుబియో ఒకే లక్ష్యాన్ని అనుసరిస్తున్నారని విదేశాంగ శాఖ ఆ ప్రకటనలో తెలిపింది.



# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :247 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 11-12-2025 | పేజీలు:4 వెల: 2.00


## రూ. 1000 కోట్లతో స్టార్ట్ అప్ ఫండ్ : సీఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్ : స్టార్టప్ ల కోసం తెలంగాణ ప్రభుత్వం రూ. 1000 కోట్లతో స్టార్ట్ అప్ ఫండ్ ఏర్పాటు చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఆ ఫండ్స్ ను వినియోగించుకుని స్టార్టప్ లు గూగుల్ స్థాయిలో లేదా 1 బిలియన్ డాలర్ల కంపెనీలుగా ఎదగాలని సూచించారు. టీ హబ్ లో గూగుల్ స్టార్టప్ ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. హైదరాబాద్ కేవలం స్టార్ట్ అప్ హబ్ గా ఎదగడమే కాదు..ఆ కంపెనీలు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని కోరుకుంటున్నానన్నారు. హైదరాబాద్ నుంచి కనీసం 100 స్టార్టప్ లు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని ఆశిస్తున్నానని, అంటే కనీసం 1 బిలియన్ డాలర్ల విలువ కలిగిన కంపెనీలుగా ఎదగాలని, 2034 నాటికి వాటిల్లో కనీసం 10 సూపర్ యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలి.అందుకోసం రాష్ట్రంలో ఒక మంచి ఎకోసిస్టమ్‌ను సృష్టించాలనుకుంటున్నామన్నారు .తెలంగాణ ప్రభుత్వం, గూగుల్ మీకు అవసరమైన సహకారం అందించడానికి సిద్దంగా ఉన్నాయన్నారు. ఈ రోజు నుంచి హైదరాబాద్ ప్రోడక్ట్ బేస్డ్ స్టార్ట్ - అప్స్, ఇన్నోవేటీవ్ స్టార్ట్-అప్స్, ఐపీ ఇంటెన్సీవ్ స్టార్ట్ %-% అప్స్ వీటి పైనే దృష్టి పెట్టాలని సూచించారు.

### సమిష్టి కృషితో స్టార్టప్ లక్ష్యాలు సాధించాలి

తెలంగాణ రైజింగ్ విజన్ స్టార్ట్-అప్స్ కోసం మీ ప్రణాళికలు ఏంటని అడిగితే స్టార్ట్ అప్ ని ఫుట్‌బాల్ ఆటతో పోల్చుతానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నేను ఫుట్ బాల్ ఆట ఆడతాను అని, ఫుట్‌బాల్‌లో సమిష్టి కృషి అవసరం అని, పట్టుదలతో సాధన చేయాలని, చివరకు గెలుపు చాలా ముఖ్యం అన్నారు. స్టార్టప్ కూడా టీమ్ వర్క్ అని, ఫుట్ బాల్ టీమ్ మాదిరిగా సమిష్టి కృషితో స్టార్టప్ లక్ష్యాలు సాధించాలని రేవంత్ రెడ్డి తెలిపారు. గత 25 సంవత్సరాల్లో సాఫ్ట్‌వేర్ సర్వీసెస్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో. హైదరాబాద్‌లో చాలా స్టార్ట్-అప్స్ పెద్ద కంపెనీలుగా ఎదిగాయన్నారు. హైదరాబాద్‌లో ఉన్న అగ్రస్థాయి స్టార్ట్-అప్స్ లో గూగుల్ ఒకటి అని గుర్తు చేశారు. తెలంగాణ భవిష్యత్ అభివృద్ధిని ఆకాంక్షించి ప్రపంచానికి తెలంగాణ బ్రాండ్ ను పరిచయం చేయాలని గత రెండు రోజులుగా తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించాం అని రేవంత్ రెడ్డి తెలిపారు. జాతీయ అంతర్జాతీయ కార్పోరేట్ల సమక్షంలో తెలంగాణ భవిష్యత్ కోసం మన విజన్‌ను ఆవిష్కరించాం. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం అన్నారు.

## రోడ్డెక్కిన 65 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు..జెండా ఊపిన మంత్రి పొన్నం

హైదరాబాద్ : తెలంగాణ ఆర్టీసీ నూతనంగా కొనుగోలు చేసిన 65 ఎలక్ట్రిక్ బస్సులు ప్రజారవాణ సేవలో రోడ్డెక్కేశాయి. రాణిగంజ్ ఆర్టీసీ డిపోలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 65 ఎలక్ట్రిక్ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. మేయర్ గద్వాల విజయ లక్ష్మీ, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి, స్థానిక కార్పొరేటర్ సుచరీత, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఇతర ముఖ్య నేతలు, అధికారులు బస్సుల ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. రాణిగంజ్ ఆర్టీసీ డిపో నుండి తార్నాక ఆర్టీసీ ఆసుపత్రి వరకు బస్సులో వారంతా ప్రయాణం చేశారు. ఈ సందర్బంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రవాణా శాఖ తరుపున ఆర్టీసీ రాణిగంజ్ నుండి 65 బస్సులు ప్రారంభం చేసుకున్నామని, ఇప్పటికే హైదరాబాద్ ,కరీంనగర్ , నిజామాబాద్ , నల్గొండ ,సూర్యాపేట లలో ఇవి బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. 2 సంవత్సరాల్లో ఇప్పుడున్న 40 శాతం బస్సులు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఆర్టీసీ లో నూతన రక్తం వస్తుందని.. కొత్తగా డ్రైవర్లు , కండక్టర్ లు, కార్మికులు వస్తున్నారని తెలిపారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ,ఉద్యోగుల సంక్షేమం,ప్రయాణికుల భద్రత దృష్టిలో పెట్టుకుందని తెలిపారు. ఢిల్లీలో నివాస యోగ్యం లేకుండా కాలుష్యం ఉన్న పరిస్థితి ఉందనొ..ఇక్కడ అలాంటి పరిస్థితి రాకుండా రవాణా శాఖ ఈవీ పాలసీ, స్క్రాప్ పాలసీ తీసుకొచ్చిందన్నారు.

### మహాలక్ష్మితో రెండేళ్లలో 251కోట్ల మహిళల ఉచిత ప్రయాణం

సీఎం రేవంత్ రెడ్డి రెండేళ్ల ప్రజా పాలన ప్రభుత్వంలో మహా లక్ష్మీ పథకం ద్వారా ఇప్పటికీ 251 కోట్ల మంది మహిళలు..8500 కోట్ల రూపాయల విలువైన ప్రయాణాన్ని చేశారని మంత్రి పొన్నం వెల్లడించారు. హాస్పిటల్ లు, విద్యా, దేవాలయాలు , ఉద్యోగాలు బంధువుల ఇంటికి ఇలా ప్రయాణాలు చేశారన్నారు. దేవాదాయ శాఖ ఆదాయం మహా లక్ష్మీ పథకం ద్వారా పెరిగిందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ఆర్టీసీ బస్సులను మహిళను యజమానులను చేసిందని తెలిపారు. ప్రయాణికులకు సౌకర్యం కోసం ఈవీ బస్సులను సమ్మక్క సారలమ్మ జాతర, శ్రీశైలం, యాదగిరిగుట్టలకు ప్రత్యేకంగా నడిపిస్తున్నామని తెలిపారు. నూతన బస్ డిపో ల ఏర్పాటు , బస్ స్టేషన్ ల అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. ఈవి పాలసీ తెచ్చి..నగరంలో కాలుష్యాన్ని తగ్గించడానికి ఈవి, CNG , LPG ఆటో లకు అనుమతి ఇచ్చామని తెలిపారు. ముఖ్యమంత్రి సూచనలతో 373 కొత్త కాలనీలకు ఆర్టీసీ బస్సులు కనెక్ట్ చేయాలని నిర్ణయం తీసుకుందని, ఈరోజు



నుండి 373 కొత్త కాలని లకు కనెక్ట్ చేయడానికి బస్సులు నడుస్తున్నాయని, దాదాపు 7 లక్షల మందికి కొత్తగా ప్రజా రవాణా సౌకర్యం ఏర్పడిందన్నారు. హైదరాబాద్ ప్రజలకే కాకా గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఎక్కడెక్కడ ఆర్టీసీ బస్సులు అవసరమున్నాయో ఆర్టీసీ అధికారులకు లేదా ప్రజా ప్రతినిధులకు తెలుపవచ్చు అని సూచించారు. ఆర్టీసీకి సంబంధించి యాత్రా దానం కార్యక్రమాన్ని తీసుకున్నాం.. ఎవరైనా జన్మదినాలు సందర్భంగా ఎవరైనా ఎన్నారై ఉన్న ముందుకు రావచ్చన్నారు.

### కొత్తగా 2400 బస్సులు: ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి

తెలంగాణ ఆర్టీసీలోని కొత్తగా 2400 బస్సులు కొనుగోలు చేసి..అందుబాటులోకి తీసుకొచ్చామని, ఈ బస్సులు ఆర్టీసీ, రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో తీసుకున్నామని ఎండీ నాగిరెడ్డి తెలిపారు. ఇంటర్సిటీ బస్సులు కూడా వస్తున్నాయని, 800కి పైగా ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని, జీహెచ్‌ఎంసీ పరిధిలో వచ్చే రెండు సంవత్సరాల్లో మొత్తం 2800 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని వెల్లడించారు. ఈ బస్సుల ద్వారా స్మూత్ జర్నీ చేయవచ్చు, ప్రతి బస్ ఒక రోజు ఒక టన్ కార్బన్ డై ఆక్సైడ్ ను తగ్గిస్తుందని తెలిపారు. 81 శాతం బస్సులు మహా లక్ష్మీ స్కీమ్ ద్వారా నడిచే బస్సులు ఉన్నాయని, ప్రతి రోజు 60 లక్షల మంది ఆర్టీసీలో ప్రయాణం చేస్తుంటే అందులో 40 లక్షల మంది మహిళా ప్రయాణికులు ఉంటారు అని, ఇప్పటి వరకు 251 కోట్ల మహిళా ప్రయాణాలు ఉచితంగా ప్రయాణం చేశారని, 8500 కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారని తెలిపారు.

## నేనే నిజమైన ప్రతిపక్షనేతను.. అడ్జస్ట్‌మెంట్ రాజకీయ నేతను కాను..



బెంగళూరు: 'నేనే నిజమైన ప్రతిపక్ష నేతనని' అడ్జస్ట్‌మెంట్ రాజకీయ నేతను కానని విజయపుర ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ మండిపడ్డారు. బెళగావి శాసనసభ సమావేశాలలో ప్రశ్నోత్తరాల వేళ రాష్ట్రంలో సాగునీటి పథకాలకు సంబంధించి భూస్వాధీన ప్రక్రియపై ఆయన ప్రసంగించారు. కృష్ణా ఎగువ ప్రాజెక్టు నిర్మాణాలు జరిగి ఆరు దశాబ్దాలు పూర్తయినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. ప్రధానంగా కృష్ణా నదికి అనుబంధంగా మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి పాలనలో ప్రారంభమైందని ఇప్పటికి ఆరు దశాబ్దాలు ముగిసినా ఇంకా మూడోవిడత పనులు చేపట్టలేద ́న్నారు.ప్రాజెక్టు పూర్తయితే ఉత్తర కర్ణాటకకు శాశ్వతంగా సాగు, తాగునీరు సాధ్యం కానుందన్నారు. ముంపు పరిహారం, పునరావాసం, కాలువల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. వీటికి రూ.70వేల కోట్ల మేర పరిహారం ఖర్చు కానుండగా ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచేందుకు మరో రూ.50వేల కోట్లు అవసరమన్నారు. ఇలా కృష్ణా ఎగువ ప్రాజెక్టుకు కనీసంగా రూ.1.20లక్షల కోట్లు అవసరం కానుందన్నారు. ఎన్నేళ్ళకు గ్రాంట్లు మంజూరు సాధ్యం కానుందన్నారు. 2023లోనే పరిహారానికి సంబంధించి కోర్టు అవార్డుకు అనుబంధంగా ఇవ్వాలన్నారు. పరిహారం విషయంలో కోర్టు సూచించిన మేరకు ఇవ్వాలని పట్టుబట్టారు.ఇదే విషయమై జలవనరుల శాఖా మంత్రి డీకే శివకుమార్‌అభ్యంతరం తెలిపారు. దీనిపై యత్నాళ్ మాట్లాడుతూ కోర్టు సూచించిన విధంగా పరిహారం ఇవ్వలేమని చెప్పడం సరికాద న్నారు. ఇదే విషయమై గతంలో కృష్ణా నదికి అనుబంధంగా ఉండే మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు అభ్యంతరం తెలిపాయన్నారు. ప్రాజెక్టు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ముఖ్యమంత్రి వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం పరిహారం విషయంలో కోర్టు తీర్పును పాటించలేమని చెప్పడం సమంజసం కాదని సభనుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు.

### ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు యువత బలి...

సమాజంలో ఆన్‌లైన్ గేమ్‌లకు యువత బలవుతున్నారని ఇటీవల హాసన్ జిల్లాలో పలు కేసులు నమోదైన విషయాన్ని సకలేశపుర ఎమ్మెల్యే సిమెంట్ మంజు సభలో ప్రస్తావించారు. ఆన్‌లైన్ గేమ్‌లు, సైబర్ నేరాలను నియంత్రణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే విషయమై హెూంమంత్రి పరమేశ్వర్ వివరణ ఇస్తూ 2023లో 22,255 సైబర్ నేరాలు నమోదు కాగా 2024వ ఏడాది 22,478 కేసులు, 2025లో ఇంతవరకు 13000ల కేసులు నమోదైనట్లు తెలిపారు. గడిచిన మూడేళ్ళతో పోల్చితే కేసులు తగ్గినట్లే అన్నారు. కాగా మూడేళ్ళలో 10,717 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు.

## తుంగతుర్తిలో కాంగ్రెస్ హత్యా రాజకీయాలను సహించేది లేదు

హైదరాబాద్,సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న హత్యా రాజకీయాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నూతనకల్ మండలం లింగంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణులపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దాడిలో బీఆర్ఎస్ కార్యకర్త ఉప్పుల మల్లయ్య ప్రాణాలు కోల్పోవడం పట్ల కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు."ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను ఎదుర్కోలేక, భౌతిక దాడులకు దిగడం కాంగ్రెస్ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనం. అధికార మదంతో కాంగ్రెస్ గూండాలు సాగిస్తున్న అరాచకాలను బీఆర్ఎస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదు," అని కేటీఆర్ హెచ్చరించారు.గత రాత్రి లింగంపల్లి గ్రామంలో సుమారు 70 మంది కాంగ్రెస్ కార్యకర్తలు కర్రలు, రాళ్లతో బీఆర్ఎస్ నాయకులే లక్ష్యంగా విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఉప్పుల మల్లయ్య మృతి చెందగా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య యాదవ్ తో పాటు మరో 15 మంది కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి.

### కార్యకర్తలకు కేటీఆర్ భరోసా

ఈ ఘటన తెలిసిన వెంటనే మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి



కిషోర్‌లతో కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. "పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు, నాయకుడికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. ఎవరూ అధైర్య పడవద్దు. మరణించిన కార్యకర్త కుటుంబానికి, గాయపడిన వారికి పార్టీ అన్ని విధాలా అండగా నిలుస్తుంది," అని కేటీఆర్ భరోసా ఇచ్చారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు

## తెలంగాణ బిడ్డలకు ఎన్ని ఉద్యోగాలు వచ్చాయో చెప్పు..




హైదరాబాద్, రేవంత్ రెడ్డి నిర్వహించింది గ్లోబల్ సమ్మిట్ లాగా లేదు, భూములు అమ్ముకునేందుకు ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ ఎక్స్ పో లాగా ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీశ్‌రావు విమర్శించారు. ఫ్యూచర్ సిటీ వేదికగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో పరువు పోగొట్టుకున్నదని అన్నారు. అందాల పోటీల్లాగే, ఏఐ సమ్మిట్ లాగే.. గ్లోబల్ సమ్మిట్ కూడా అట్టర్ ఫ్లాప్ షో అయ్యిందని ఎద్దేవా చేశారు.విజన్ డాక్యుమెంట్ లో విజన్ లేదు, దాన్ని చేరుకునే మిషన్ లేదని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. విజన్ డాక్యుమెంట్ ప్రిపరేషన్ లో కమిట్మెంట్ లేదు. ఆ డాక్యుమెంట్ కు శాంటిటీ లేదని అన్నారు. అక్షరాలు, అంకెలు, రంగు రంగుల పేజీలతో అర్థం లేకుండా అల్లిన అబద్ధాలు, అర్థ సత్యాల 'విజన్ లెస్' డాక్యుమెంట్ అది అని అన్నారు. రెండేళ్ల పాలన వైఫల్యాల నుంచి దృష్టి మరల్చడానికి రేవంత్ రెడ్డి చేసిన పీఆర్ స్టంట్ గ్లోబల్ సమ్మిట్ అని విమర్శించారు. గ్లోబల్ సమ్మిట్ అని మూడు నెలల నుంచి ఊదరగొట్టారని.. 18 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, 5వేల మంది విదేశీ ప్రతినిధులు వస్తరు అన్నారని.. మంత్రులు పోయి ఒక్కో ముఖ్యమంత్రికి స్వయంగా ఆహ్వాన పత్రికలు అందించారని గుర్తుచేశారు. కనీసం ఒక్క ముఖ్యమంత్రి రాలేదు, 5వేల మంది విదేశీ రిప్రెజంటేటివ్స్ రాలేదు. ఒక్క మీ పార్టనర్ డీకే శివకుమార్ తప్ప అని అన్నారు. చివరకు ఏఐసీసీ నేతలు, కాంగ్రెస్ ఎంపీలు కూడా రాని పరిస్థితి ఉందని విమర్శించారు.గ్లోబల్ సమ్మిట్‌లో గ్లోబల్ రిప్రెజెంటేటివ్స్ కరువయ్యారని అన్నారు. ఆఖరుకు ఎంబీఏ విద్యార్థులను, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు కోట్ వేసి తెచ్చి కూర్చోబెట్టారని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ కాదు అది లోకల్ సమ్మిట్.. అట్టర్ ఫ్లాప్ పొలిటికల్ షో ఇది అని విమర్శించారు. ఫార్మా సిటీ భూముల్లో ఫ్యూచర్ సిటీ అని, ఆ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల కోసం గ్లోబల్ సమ్మిట్ అని.. అందమైన కట్టుకథ అల్లినవు రేవంత్ రెడ్డి? బయో స్కోప్ సినిమా చూపించావు.. భూముల స్కాం అయిపోయింది.. పవర్ స్కాం అయిపోయింది.. లిక్కర్ స్కాం అయిపోయింది.. ఇప్పుడు ఇగ రియల్ ఎస్టేట్ స్కాం మొదలు పెట్టిండు అని మండిపడ్డారు. రేవంతు గ్లోబల్ సమ్మిట్ పెట్టింది ఫోర్త్ సిటీ వైపు రియల్ ఎస్టేట్ డెవలప్మెంట్ కోసమే కానీ, పెట్టుబడుల కోసం కాదు అని అందరికీ అర్థం అయ్యిందని అన్నారు.ఫార్మా సిటీ పక్క భూములు ముందుగానే మీ బినామీలతో కొనిపించిలే అవుట్లు చేసి రెడీగా పెట్టుకున్నాడని అన్నారు. ఇప్పుడు అక్కడ గ్లోబల్ సమ్మిట్ అని పెట్టి, ఆ భూములను తెగ నమ్మడానికి ప్లాన్ వేశావని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. గ్లోబల్ సమ్మిట్ పేరిట రియల్ ఎస్టేట్ స్కాం కు తెరతీశావని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడులు తెచ్చింది లేదు, ఉద్యోగాలు ఇచ్చింది లేదు. రెండేళ్లుగా పెట్టుబడుల పేరిట కట్టు కథలు తప్ప చేసింది ఏం లేదని అన్నారు.2024 జనవరి నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల మంత్రి దావోస్ సమావేశానికి వెళ్లారని తెలిపారు. 40,232 కోట్ల పెట్టుబడులు సాధించినం అని, 2,500 ప్రత్యక్ష ఉద్యోగాలు వస్తయని చెప్పారని గుర్తుచేశారు. ఆ పెట్టుబడులు ఏమయ్యాయి? ఆ ఉద్యోగాలు ఎక్కడ వచ్చాయని నిలదీశారు. ఇదే రాష్ట్ర ప్రభుత్వం 2024 సెప్టెంబర్ నెలలో ఏఐ గ్లోబల్ సమ్మిట్ -2024 నిర్వహించిందని గుర్తుచేశారు. 100 దేశాల కంపెనీలు పాల్గొన్నరూ, 20 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నం అని డబ్బా కొట్టారని తెలిపారు. ఆ పెట్టుబడులు ఏమయ్యాయి? ఆ ఉద్యోగాలు ఎక్కడ వచ్చాయని ప్రశ్నించారు. జనవరి 2025 వరల్డ్ ఎకనామిక్ ఫోరం దావోస్ లో జరిగిన సమావేశం సీఎం, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారని తెలిపారు. పెద్ద ఎత్తున పెట్టుబడులు తెస్తున్నం అని అక్కడ ఎంతో తిరిగినట్లు, ఎంతో కష్ట పడ్డట్లు సూటు బూటు వేసుకున్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెట్టించుకున్నారని పేర్కొన్నారు. అంతా అయిపోయినంక 16 ప్రపంచ అగ్రగామి కంపెనీలతో సుమారు లక్షా డెబ్బై ఎనిమిది వేల కోట్ల (1.78లక్షల కోట్లు) పెట్టుబడుల ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్నదని ఘనంగా ప్రకటించారని.. ఈ ఒప్పందాల ద్వారా 49,550 ఉద్యోగాలు వస్తయి అన్నరని తెలిపారు. ఆ పెట్టుబడులు ఏమయ్యాయి? ఆ ఉద్యోగాలు ఎక్కడ వచ్చాయని ప్రశ్నించారు.పెట్టుబడులు తెస్తం అని రెండు సార్లు దావోస్ పోయిండు. అమెరికా పోయిండు. సౌత్ కొరియా పోయిండు. ఆస్ట్రేలియా పోయిండు, సింగపూర్ పోయిండు, జపాన్ పోయిండు. ఆ పెట్టుబడులు ఏమయ్యాయి? ఆ ఉద్యోగాలు ఎక్కడ వచ్చాయని హరీశ్‌రావు నిలదీశారు. నిన్న, మొన్న రెండు రోజుల పాటు జరిగిన సమ్మిట్ లో ఏకంగా 5లక్షల కోట్ల పై చిలుకు పెట్టుబడులు, వేల సంఖ్యలో ఉద్యోగాలు అంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ సవాలు విసిరారు. దమ్మంటే స్వీకరించాలని అన్నారు. రెండేళ్లుగా కోట్లు ఖర్చు చేసి నువ్వు తిరిగిన దేశాలు, నిర్వహించిన సమ్మిట్స్ ద్వారా మొత్తం ఎన్ని కోట్ల పెట్టుబడులు వచ్చాయి? అందులో ఎన్ని కంపెనీలు గ్రౌండ్ అయ్యాయి? ఎంత మంది తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలు వచ్చాయి.. శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దావోస్ పెట్టుబడులు, అమెరికా, సౌత్ కొరియా, జపాన్, సింగపూర్ కంపెనీలు ఎక్కడకు పోయాయి, పెట్టుబడులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయని ప్రశ్నించారు.

## గుడ్ న్యూస్.. కార్పొరేషన్ పోస్టులపై కీలక ప్రకటన.!!

హైదరాబాద్, డిసెంబరు10 : త్వరలో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులు భర్తీ చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.టీపీసీసీ నియామకం జరిగిన రోజే డీసీసీలతో మినహా అన్ని పోస్టులు రద్దు అవుతాయని తెలిపారు. ఈనెల చివరి నాటికి కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పుకొచ్చారు. లంబాడాలకు నాలుగు జిల్లాలకు అధ్యక్షులను నియమించామని తెలిపారు. ఎస్టీలకు కాంగ్రెస్ పార్టీలో తగిన ప్రాధాన్యం ఉంటుందని వివరించారు.(బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో చిట్‌చాట్ చేశారు మహేశ్ కుమార్ గౌడ్.గ్లోబల్ సమ్మిట్ సక్సెస్ చూడలేక మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఊహించని స్థాయిలో పెట్టుబడులు వచ్చాయని చెప్పుకొచ్చారు. పేరుగాంచిన కంపెనీలతోనే ఒప్పందాలు జరిగాయని వివరించారు. ముందు కొన్ని కార్యక్రమాలు ఫిక్స్ కావడంతో ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే ,రాహుల్ గాంధీ గ్లోబల్ సమ్మిట్‌కు రాలేకపోయారని తెలిపారు. శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము తమకు మాత్రమే ఉందని పేర్కొన్నారు. శ్వేతపత్రం అంటే బీఆర్ఎస్‌కు భయమని ఎద్దేవా చేశారు మహేశ్ కుమార్ గౌడ్.

### బీఆర్ఎస్ కబ్జాలు బయటకు వస్తున్నాయి..

'ఫ్యూచర్ సిటీ భవిష్యత్‌లో గొప్పగా ఉంటుంది. లావాదేవీలలో భాగంగానే కవిత - బీఆర్ఎస్ నేతల మధ్య విమర్శలు చేసుకుంటున్నారు. కవిత కారణంగా బీఆర్ఎస్ కబ్జాలు అన్ని బయటకు వస్తున్నాయి. కవిత ఆరోపణలపై విచారణ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నా. నేను పీసీసీగా చాలా సంతృప్తిగా



ఉన్నా.. ఆర్గనైజేషన్ అంటే నాకు ఇష్టం. మీడియాలో అప్పుడే డిప్యూటీ సీఎం అంటున్నారు.. అప్పుడే మంత్రి అంటూ ఊహాగానాలు వస్తున్నాయి. లోక్‌సభలో ప్రియాంక గాంధీ చాలా బాగా మాట్లాడారు' అని పేర్కొన్నారు మహేశ్ కుమార్

### నెహ్రూపై బీజేపీది అసత్య ప్రచారం..

'పశ్చిమ బెంగాల్ ఎలక్షన్ కోసం వందేమాతరాన్ని బీజేపీ తెరపైకి తెచ్చింది. మోదీ జీవితంలో అతిపెద్ద పొరపాటు చేశారు. నెహ్రూ వల్లే దేశం వెనకబడిందని బీజేపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారు. గత ముఖ్యమంత్రి ఉస్మానియా విశ్వవిద్యాలయం వెళ్లాలంటే బయపడ్డారు. 1965లో ఇందిరాగాంధీ ఆర్ట్స్ కాలేజీ మెట్లు ఎక్కారు. 60 సంవత్సరాల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఆర్ట్స్ కాలేజీ మెట్లు ఎక్కడం చరిత్ర' అని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు.

## సంపాదకీయం

**గురువారం 11-12-2025**

# గుదిబండగా మారిన వీసాల జారీ

ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన వైఖరితో వీసాల జారీ గుదిబండగా మారింది. అమెరికాలో చదవాలని ఎంతో మంది కలలు కంటుంటే వారి కలలకు అమెరికా అడ్డుకట్ట వేస్తోంది. అర్థంలేని ఆంక్షలతో భారతీయ విద్యార్థులపై కొరడా ఘులిపిస్తుంది. ప్రపంచ దేశాలకు పెద్దన్న అయిన అమెరికాకు వెళ్లేందుకు చాలా మంది ఏటా ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. చదువు, ఉద్యోగం, వ్యాపారం, స్థిర నివాసం కోసం అమెరికా వెళ్తూ ఉంటారు. కానీ ఇప్పుడు అమెరికా అంటేనే స్టూడెంట్స్, పేరెంట్స్ తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ట్రంప్ ఎప్పుడు ఏం బాంబ్ పేలుస్తారో.. ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో.. దాని వల్ల తమకేం ఇబ్బందులు వస్తాయో అని ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే ఈ ఏడాదిలో అమెరికా ఇచ్చే స్టూడెంట్ వీసాలకు అప్లై చేసుకునే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పడిపోయింది. ఎంతలా అంటే కొవిడ్ సమయంలో కూడా ఇంతకు పడిపోవడం జరగలేదని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అమెరికాలో చదవాలని ఎంతో మంది కలలు కంటారు. అందుకోసం చాలా కష్టపడి చదివి.. అర్హత పరీక్షలు రాస్తారు. ఈసారి కాకపోతే వచ్చేసారి అంటూ ఏళ్ల తరబడి అమెరికా యూనివర్సిటీల్లో అడ్మిషన్ కోసం ఎదురు చూస్తూనే ఉంటారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను అమెరికాలో చదివించాలనే బలమైన పట్టుదలతో ఉంటారు. కానీ.. ప్రస్తుతం ఆ కలలు మొత్తం కల్లలు అవుతున్నాయి. రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ తీసుకునే నిర్ణయాలు, విధిస్తున్న ఆంక్షలు, ప్రస్తుతం అక్కడి పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని.. అమెరికాలో చదవాలని భావించే భారత విద్యార్థులు.. వెనకడుగు వేస్తున్నారు. గతంలో కరోనా మహమ్మారి విస్తరించిన సమయంలో కంటే తక్కువగా.. ఈసారి స్టూడెంట్ వీసాలకు దరఖాస్తులు వచ్చినట్లు అమెరికా దౌత్య అధికారులు చెబుతున్నారు. అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించాలనే ఇండియన్ స్టూడెంట్స్ కలలు ఈ ఏడాది ఆరంభంలోనే సవాళ్లు ఎదుర్కొంటున్నాయి. సాధారణంగా అమెరికా స్టూడెంట్ వీసాల సీజన్‌కు.. ప్రతీ ఏడాది మార్చి నుంచి జూలై నెలలు చాలా కీలకంగా ఉంటుంది. ఆగస్టు/సెప్టెంబర్‌లో ప్రారంభమయ్యే ఫాల్ సెమిస్టర్‌కు సిద్ధమయ్యే విద్యార్థులు.. మార్చి నుంచి జూలై మధ్య వీసాల కోసం భారీగా దరఖాస్తు చేసుకుంటారు. అయితే తాజా గణాంకాలు భారతీయ విద్యార్థులకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. అమెరికా విదేశాంగ శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది మార్చి నుంచి మే మధ్య కాలంలో జారీ అయిన ఎఫ్-1 (అకాడమిక్) (ఎఫ్-1) వీసాల సంఖ్య గణనీయంగా పడిపోయింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 27 శాతం తగ్గుదల నమోదైంది. ఈ ఏడాది కేవలం 9,906 ఎఫ్-1 వీసాలు మాత్రమే భారతీయ విద్యార్థులకు జారీ అయ్యాయి. అంతకుముందు 2023లో ఇదే కాలంలో 14,987 వీసాలు జారీ కాగా.. 2024లో 13,478 వీసాలు భారతీయ విద్యార్థులు పొందారు. మరీ ముఖ్యంగా.. కొవిడ్-19 మహమ్మారి తర్వాత అంతర్జాతీయ ప్రయాణాలు తిరిగి ప్రారంభమైన 2022 మార్చి నెల నుంచి మే నాటి 10,894 వీసాలతో పోలిస్తే.. ఈ ఏడాది మరింత తగ్గడం గమనార్హం. అమెరికా స్టూడెంట్ వీసాలు తగ్గడంలో కొన్ని కీలక కారణాలు ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ విద్యార్థులపై ట్రంప్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడం ఇందుకు ప్రధాన కారణం అని తెలుస్తోంది. మరోవైపు.. ఇజ్రాయెల్ గాజా యుద్ధంలో భాగంగా పాలస్తీనా మద్దతు ఆందోళనల్లో పాల్గొన్న పలువురు విద్యార్థుల (కొందరు భారతీయ విద్యార్థులు) వీసాలను రద్దు చేయడం.. అలాగే మే 27వ తేదీ నుంచి జూన్ 18వ తేదీ వరకు కొత్త వీసా దరఖాస్తులను 2 వారాల పాటు నిలిపివేసి.. దరఖాస్తుదారుల సోషల్ మీడియా కార్యకలాపాలపై నిఘా (సోషల్ మీడియా వెట్టింగ్) పెట్టడం వంటి ఆంక్షలతో విదేశీ విద్యార్థులు.. అమెరికాలో చదువుకోవాలంటేనే ఆలోచించే పరిస్థితి నెలకొంది. ఈ వీసా అప్లికేషన్లు 2 వారాలు ఆపడం వల్ల కూడా వీసా దరఖాస్తులు తగ్గడానికి కారణమని నిపుణులు చెబుతున్నారు. అమెరికన్ యూనివర్సిటీలకు ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల్లో కోతలు విధించడం, అంతర్జాతీయ విద్యార్థుల నమోదుపై పెరుగుతున్న నిఘా వంటి సవాళు కొత్తగా వచ్చి పడ్డాయి. పొలిటికో నివేదిక ప్రకారం.. మే నెలలో ట్రంప్ ప్రభుత్వం అమెరికా రాయబార కార్యాలయాలను, కాన్సులర్ విభాగాలను విద్యార్థి వీసా దరఖాస్తుదారులకు కొత్త ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను నిలిపివేయాలని ఆదేశించి.. వారి సోషల్ మీడియా వెట్టింగ్‌ను తప్పనిసరి చేయాలని ఆదేశించింది. జూన్ నాటికి.. ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం ఎఫ్, ఎమ్, జే కేటగిరీ వీసా దరఖాస్తుదారులకు స్క్రీనింగ్ ప్రక్రియను సులభతరం చేయడానికి వారి సోషల్ మీడియా ఖాతాలను పబ్లిక్‌గా ఉంచాలని సూచించింది. ఈ ఏడాది మొదట్లో వీసా దరఖాస్తులు నెమ్మదించినప్పటికీ.. గత కొన్నేళ్లుగా అమెరికాలో చదువుకునేందుకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పెరగడం గమనార్హం. ఓపెన్ డోర్స్ 2024 డేటా ప్రకారం.. 2023-24 అకడమిక్ ఇయర్‌లో చైనా విద్యార్థులను అధిగమించి.. అమెరికాలోనే అతిపెద్ద అంతర్జాతీయ విద్యార్థులుగా భారతీయ విద్యార్థులు నిలిచారు. అంతకుముందు అమెరికాలో చదువుకునే విదేశీ విద్యార్థుల్లో చైనీయులు అగ్రస్థానంలో ఉండగా.. వారిని భారతీయులు అధిగమించారు. ఇది అమెరికా విద్య పట్ల భారతీయ విద్యార్థులకు ఉన్న ఆసక్తిని, పోటీని తెలియజేసింది. అయితే.. 2024లో మొత్తం విద్యార్థి వీసా జారీల్లో తగ్గుదల కనిపించింది. ఆ తర్వాత ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన వైఖరితో ఆ సంఖ్య మరింత తగ్గింది. కొవిడ్ మహమ్మారి తర్వాత.. 2024లో భారతీయ పౌరులకు అమెరికా విద్యార్థి వీసాలు భారీగా తగ్గించినట్లు తెలుస్తోంది. జనవరి నుంచి సెప్టెంబర్ 2024 వరకు.. భారతీయ విద్యార్థులకు కేవలం ఎఫ్-1 వీసాలు 64,008 మాత్రమే జారీ అయ్యాయని తెలుస్తోంది. ఇదే 2023లో 1.03 లక్షలు.. 2022లో 93,181 నుంచి గణనీయమైన తగ్గుదల కనిపించింది.

# ఆర్.ఎస్.ఎస్ నిరంకుశత్వ మూలాలు



న్యూఢిల్లీ,పదకొండేళ్ల మోడీ ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదకర స్థాయిలో అడుగంటిపోయింది. ఇది కేవలం ఎన్నికల వ్యవస్థను చెరబట్టడానికే పరిమితం కాలేదు. అన్ని వ్యవస్థల్లో ప్రజాస్వామిక హక్కులను కూల్చేసింది. సమాజం అంచున జీవిస్తున్న వారిని మరింత మూలకు నెట్టివేసింది. రాజ్యాంగ సంస్థలను సంఘీయులు ఆక్రమించుకున్నారు. రాజ్యాంగాన్ని డొల్లగా మార్చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరుస్తున్నారు. విద్వేషపూరిత హిందూత్వ భావజాలంతో సమాజంలో హింసను, అణచివేతను ప్రేరేపిస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏ ప్రభుత్వం అయినా కార్మికుల కష్టజీవుల అవసరాలను, ఆకాంక్షలను నెరవేర్చాలి. సామాజికంగా అణిచివేతకు గురవుతున్న వారికి ఆలంబనగా నిలవాలి. కానీ బిజెపి ప్రభుత్వ పాలనలో మన దేశంలో ఆర్థిక అసమానతలు తీవ్రతరమయ్యాయి. కష్టజీవులు, పేదలు మరింతగా విస్మరణకు గురవుతున్నారు. అతి కొద్దిమంది కార్పొరేట్ సంస్థల అధిపతులు శతాధిక కోటీశ్వరులై అధికారాన్ని చలాయిస్తున్నారు. ఇదంతా ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? వంటి కీలకమైన ప్రశ్నలకు సమాధానాలు సంక్లిష్టంగా సుదీర్ఘ విశ్లేషణలతో కూడుకుని ఉంటాయి. ప్రధాన కారణం మాత్రం అధికారంలో ఉన్న బిజెపి, దానిని వెనుక నుండి నడిపిస్తున్న ఆర్.ఎస్.ఎస్ సైద్ధాంతిక భావజాలంలో వేళ్లూనుకుని ఉంది. మన ప్రధానమంత్రి, ఆయన మంత్రివర్గ సహచరులు అనేక మంది, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు అందరూ ఆర్.ఎస్.ఎస్ ప్రచారక్‌లు, సభ్యులే. వీళ్లందరిలో నరనరాన ఆర్.ఎస్.ఎస్ భావజాలం నిండి ఉన్నది. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వీళ్లంతా ఆ భావజాలాన్నే ఆచరణలో పెడుతున్నారు. వాస్తవానికి ప్రజలు ఈ భావజాలానికి ఓటు వేసి అధికారం కట్టబెట్టలేదు. కానీ మన దేశ గతిని ఈ భావజాలమే నిర్దేశిస్తున్నది.

### ఫాసిజం నుండి ప్రేరణ

1925లో ఆర్.ఎస్.ఎస్ ఆవిర్భవించిన కాలం నాటి నుండి యూరప్‌లో వెల్లువెత్తిన ఫాసిస్టు భావజాలాన్ని స్ఫూర్తిగా ఎంచుకున్నది. ఈ ప్రభావానికి మూలకారకుడు బి.ఎస్.మూంజీ. 1931 మార్చి నెలలో మూంజీ ఇటలీ నియంత ముస్సోలినీని కలుసుకున్నాడు. రోమ్‌లో నేషనల్ ఫాసిస్టు పార్టీ ఆధ్వర్యంలో నడుస్తున్న వివిధ సంస్థల పని తీరును దగ్గర నుండి పరిశీలించాడు. ఆర్.ఎస్.ఎస్ వ్యవస్థాపకుడు కె.బి.హెడ్గేవార్‌కు మూంజీ అత్యంత సన్నిహితుడు, మార్గదర్శి. ఇటలీ ఫాసిస్టులు బైలిల్లా సంస్థ ద్వారా యువతరాన్ని పోగేసి వారికి సైనిక శిక్షణ ఇవ్వడం, యూనిఫారమ్ నిర్దేశించడం వంటి అంశాలతో మూంజీ ప్రభావితం అయ్యాడు. ఇవన్నీ మూంజీ తన డైరీలో రాసుకున్నాడు. ఆ డైరీ ప్రతులు నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీలో ప్రదర్శనకు ఉంచబడ్డాయి. ఈమధ్య ఈ మ్యూజియానికి ఉన్న నెహ్రూ పేరును తొలగించి ప్రధానమంత్రి మ్యూజియం అండ్ లైబ్రరీగా మార్చింది మోడీ ప్రభుత్వం. 'ఫాసిస్టు భావం ప్రజలను ఐక్యం చేస్తుంది. హిందూ ఇండియాలో కూడా హిందువులను సైనికీకరించడానికి ఇలాంటి సంస్థ అవసరం. డాక్టర్ హెడ్గేవార్ నాయకత్వంలో నాగపూర్‌లో స్థాపించిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఇలాంటి కోవకు చెందినదే' అని మూంజీ రాశాడని ఇటలీ పరిశోధకుడు మారియా కానలారీ వెల్లడించాడు.ఫాసిజం లక్షణాల్లో ఒకటైన యువతను సైనికీకరించడం అన్న భావనకు మూంజీ వాహకంగా మారాడు. ఆర్.ఎస్.ఎస్ సిద్ధాంతకర్త ఎం.ఎస్.గోల్వాల్కర్ అయితే నాజీయిజం పట్ల అమితాసక్తి ప్రదర్శించాడు. 'మనము-మన జాతీయత' అన్న సిద్ధాంత గ్రంథంలో హిట్లర్ యూదులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఘనకార్యంగా కొనియాడాడు. "జర్మన్ జాతి ఔన్నత్యం ఇవాళ చర్చనీయాంశంగా మారింది. జాతి స్వచ్ఛతను, సంస్కృతిని కాపాడుకోవడం కోసం దేశం నుండి పరాయి జాతీయులను-యూదులను-ప్రక్షాళన చెయ్యడం ప్రపంచాన్ని కుదిపేసింది. జాతి గౌరవానికి మించినది వేరేది లేదు అని ఇక్కడ చాటి చెప్పారు. అన్య జాతీయులు, అన్య సంస్కృతులు కలిసి ప్రధాన స్రవంతిలో మూలాలకంటా మిళితం కావడం ఎలా అసాధ్యమో జర్మనీ మనకు రుజువు చేసింది. హిందూస్థాన్ కూడా ఈ పాఠం నేర్చి లబ్ధి పొందాలి" అని గోల్వాల్కర్ సిద్ధాంతీకరించాడు.గోల్వాల్కర్ రాసిన ఈ పుస్తకం 1939లో ప్రచురించబడింది. 1938 నవంబర్ నాటికే జర్మనీలో యూదుల మీద జాతి హత్యాకాండ మొదలయ్యింది. వందలాది మంది యూదులు హత్యగావించబడ్డారు. 1400 యూదు ప్రార్థనా మందిరాలు (సినగోగ్‌లు), 7000 యూదు దుకాణాలను నాజీ మెరుపు దళాలు జర్మనీ, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్ దేశాలలో ధ్వంసం చేశాయి. యూదుల మీద నాజీ మూకలు చేసిన ఈ హీనమైన దాడులను జాతి ఔన్నత్యం కోసం తపించిపోతున్న భారత దేశంలోని హిందువులు కూడా ఒక ఉదాహరణగా పరిగణించాలని గోల్వాల్కర్ అభిప్రాయపడ్డాడు. ఫాసిజంలో మరో ప్రధానాంశమైన జాత్యహంకార ధోరణిని అందిపుచ్చుకుని హైందవేతర మతాల పట్ల విద్వేషాన్ని వెళ్ళగక్కాడు.గోల్వాల్కర్ సిద్ధాంతాన్ని ఆర్.యస్.యస్ ఆవాహన చేసుకున్నది. అన్య మతస్థుల పట్ల ఉన్న ఈ విద్వేష వైఖరినే రాజకీయ వ్యవస్థలో కూడా చొప్పించింది. ముస్లింలను లక్ష్యంగా చేసుకుని వారిని వేధించడానికి ఉద్దేశించిన చట్టాలను రూపొందించడంతో పాటు పోలీసు, తదితర వ్యవస్థలను వారి మీదకు ఉసిగొల్పుతున్నది. జాతి ఔన్నత్యం, సైనికతత్వం, మైనార్టీలపై హింసాత్మక దాడులు, మతతత్వ హిందూ రాజ్య స్థాపన-ఇవన్నీ మన దేశ రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రజాస్వామ్య స్ఫూర్తికి తీరని విఘాతం కల్పిస్తున్నాయి. మన రాజ్యాంగం పట్ల ఆర్.యస్.యస్ తన వ్యతిరేకతను చారిత్రకంగా బాహాటంగానే చెబుతున్నది.

### రాజ్యాంగం పట్ల శతృత్వం

1949లో రాజ్యాంగ అసెంబ్లీ మన దేశ రాజ్యాంగాన్ని ఆమోదించిన నాటి నుండి ఆర్.యస్.యస్ దానిని కించపరుస్తూ ప్రచారం కొనసాగిస్తూనే ఉంది. "మన రాజ్యాంగంలో ప్రాచీన భారతదేశంలో ఏనాడో రూపొందించుకున్న రాజ్యాంగ ప్రస్తావనే లేదు. స్పార్టాకు చెందిన వైకుర్గాస్, పర్షియాకు చెందిన సొలోన్‌ల కన్నా ముందుగానే మన భారతదేశంలో మనువు ధర్మాన్ని రూపొందించాడు. ఈ రోజుకీ మనుధర్మ శాస్త్రంలోని సూత్రాలను ప్రపంచవ్యాప్తంగా ఎంతో భావోద్వేగంతో కొనియాడుతున్నారు. మనుధర్మ సూత్రాల పట్ల విధేయతను పాటిస్తూ ఆచరిస్తున్నారు. కానీ మన రాజ్యాంగ పండితులకు అంతటి ధర్మశాస్త్రం గురించి వీసమెత్తు పట్టింపు లేకపోయింది." అని 1949 నవంబరు 30 'ఆర్గనైజర్' (ఆర్.ఎస్.ఎస్ అధికార పత్రిక) సంపాదకీయం విమర్శించింది."మన రాజ్యాంగం వివిధ పశ్చిమ దేశాల రాజ్యాంగాల నుండి వేర్వేరు అంశాలను ఎత్తిరాసుకున్న కంగాళీ రాజ్యాంగం. ఇది ఫక్తు విజాతీయ రాజ్యాంగం. ఇందులో ఒక్క అంశం కూడా మన స్వంతం అని చెప్పుకోవడానికి లేదు. మన జాతీయ లక్ష్యం ఏమిటి, జీవితంలో కీలకాంశం ఏమిటి అని ఎక్కడైనా ఒక్క ముక్కయినా ప్రస్తావించారా?" అని గోల్వాల్కర్ తన 'బంచ్ ఆఫ్ థాట్స్' (పాంచజన్యం) పుస్తకంలో ఘాటుగా విమర్శించాడు. మన రాజ్యాంగానికి మనుస్మృతి ఆధారంగా ఉండి ఉండాల్సిందని గోల్వాల్కర్ అభిప్రాయం. మనుస్మృతిలో ఎన్ని అమానవీయ అంశాలున్నాయో అందరికీ తెలుసు. చాతుర్వర్ణ వ్యవస్థను కీర్తిస్తూ శూద్రులను, మహిళలను అణగదొక్కే దుర్మార్గమైన వ్యవస్థకు ప్రతిరూపం మనుధర్మశాస్త్రం. పీడకల వంటి మనధర్మ శాస్త్ర సూత్రాలను ఆచరించడం అంటే మన రాజ్యాంగంలో పొందు పరుచుకున్న ప్రజాస్వామ్యానికి నిలువునా ఉప్పు పాతర వెయ్యడమే.

### కేంద్రీకృత ప్రభుత్వం

"అధికారాలు, విధులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్యన సమతూకంగా పంపిణీ చేసిన మన రాజ్యాంగ సమాఖ్య వ్యవస్థ ఒట్టి బోగస్. పనికిమాలినది" అని గోల్వాల్కర్ అనేక సందర్భాలలో రాసుకొచ్చాడు. కేంద్రీకృత ప్రభుత్వం, ఏకీకృత పరిపాలన ఉండాల్సిందే అని నొక్కివక్కాణించాడు. రాజ్యాంగానికి తగు సవరణ చేసి ధైర్యంగా కేంద్రీకృత ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యడం ఒక్కటే మార్గం. ఒకే దేశం, ఒకే ప్రజ, ఒకే ప్రభుత్వం, ఒకే శాసనాధికారం మన లక్ష్యం కావాలి. పరిపాలనా సౌలభ్యం కోసం దేశాన్ని వివిధ జోన్‌లుగా రూపొందించాలి. కార్యనిర్వాహక అధికారాలను వికేంద్రీకరించవచ్చు కానీ శాసనాధికారం మాత్రం కేంద్రీకృతంగా ఉండాలి. ప్రజాస్వామ్య ఆకాంక్షలు నెరవేర్చడానికి అనేక ప్రాదేశికాలు, ప్రాదేశిక ప్రభుత్వాలు అవసరం. అని కొంత మంది వాదిస్తున్నారు. ఇన్ని శాసన వ్యవస్థలు ఉండటానికి, ప్రజాస్వామ్యానికి ఉన్న సంబంధం ఏమిటో నేను అర్థం చేసుకోలేకపోతున్నా. దేశం యావత్తు ప్రజాస్వామిక ఆకాంక్షలను కేంద్రీకృత శాసన వ్యవస్థ మాత్రమే నెరవేర్చగలదు" అని గోల్వాల్కర్ తన 'బంచ్ ఆఫ్ థాట్స్' పుస్తకంలో ప్రకటించాడు.ఏకీకృత ప్రభుత్వం అనేది దేశంలోని

# ప్రయాణికుల సమస్యలపై ఆరాతీయండి




న్యూఢిల్లీ,ఇండిగో విమాన సర్వీసుల్లో ఏర్పడిన అంతరాయం కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగింది. దేశవ్యాప్తంగా విమానాశ్రయాల కార్యకలాపాలపై 24 గంటల సమీక్షను ప్రారంభించినట్లు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసి, ప్రయాణికుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ఉన్నతాధికారులను ప్రధాన విమానాశ్రయాలకు పంపినట్లు ఆయన వెల్లడించారు. ఈ విషయంపై రామ్మోహన్ నాయుడు 'ఎక్స్' వేదికగా ప్రకటన చేశారు. "డిసెంబర్ 3వ తేదీ నుంచి ఇండిగో కార్యకలాపాల్లో సమస్యలు మొదలైనప్పటి నుంచి పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, డీజీసీఏ పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నాయి," అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత పరిణామాలను "అసాధారణ పరిస్థితి"గా అభివరి?ంచిన ఆయన, ఉన్నతస్థాయిలో తక్షణ జోక్యం అవసరమని స్పష్టం చేశారు. ఇటీవల తమ మంత్రిత్వ శాఖ, డీజీసీఏ ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ఎయిర్‌పోర్టులకు వెళ్లి తనిఖీలు చేయాలని, ప్రయాణికులతో మాట్లాడి వారి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని, ఎయిర్‌లైన్ సిబ్బంది సేవలపై ఆరా తీయాలని సూచించారు. ప్రయాణికుల నుంచి వచ్చిన ఫిర్యాదులను, గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ అయిన ఇండిగో, గత కొన్ని రోజులుగా కార్యాచరణ సవాళ్లను ఎదుర్కొంటోంది. దీంతో ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రధాన విమానాశ్రయాల్లో తీవ్ర అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ప్రయాణికులు సోషల్ మీడియాలో భారీ క్యూలు, చెక్-ఇన్ ప్రక్రియలో జాప్యం, విమానాల సమాచారంపై స్పష్టత లేకపోవడం వంటి సమస్యలపై ఫిర్యాదులు చేస్తున్నారు. క్షేత్రస్థాయి నుంచి అధికారుల నివేదికలు అందిన తర్వాత, రానున్న 24 గంటల్లో మంత్రిత్వ శాఖ సమగ్ర మార్గదర్శకాలను జారీ చేసే అవకాశం ఉంది. దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో సంక్షోభంలో చిక్కుకుంది. సిబ్బంది కొరతతో సతమతం అవుతున్న ఇండిగో.. తీరుతో ప్రయాణికుల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది. దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో ఇండిగో విమానాలు రద్దయ్యాయి.. అయితే.. కొన్ని విమానాలు మాత్రం ఆలస్యంగా నడుస్తున్నాయి.. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు గోవా, అహ్మదాబాద్‌లో సర్వీసులు రద్దయ్యాయి.. సాంకేతికలోపం, సిబ్బంది కొరతతో విమానసేవల్లో సమస్యలు మొదలయ్యాయి.. ఈ క్రమంలో ఇండిగో ఫ్లైట్స్ క్యాన్సిలేషన్స్ ఎఫెక్ట్ పెళ్లిళ్లు, శుభకార్యాలపై కూడా పడుతోంది.. ఓచోట కొత్త జంట వాళ్ల రిసెప్షన్‌కి వాళ్లే వెళ్లలేకపోతే.. మరోచోట పెళ్లికొడుకు ఎయిర్‌పోర్ట్‌లో ఇరుక్కుపోయాడు.. ఈ వారం ఇండిగో విమానాల రద్దు కారణంగా వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు, అయితే ఈ అంతరాయం ముఖ్యంగా వధూవరులను తీవ్రంగా దెబ్బతీసింది. ఒక జంట వీడియో కాల్ ద్వారా తమ వివాహ రిసెప్షన్‌కు జరుపుకుంటే.. మరికొందరు వివాహ వేడుకలను రద్దు చేసుకోడానికి రెడీ అయ్యారు. కొందరైతే పెళ్లి వాయిదా వేయడం ఇష్టం లేక ఖరీదైన చార్టర్ ఫ్లైట్‌ను బుక్ చేసుకోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఓ యువకుడు తన వెడ్డింగ్ కార్డును చూపిస్తూ..ఎయిర్‌లైన్స్ సమస్య కారణంగా నా పెళ్లికి నేను హాజరుకాలేకపోతున్నాను అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ వీడియోను తన ఎక్స్ ఖాతాలో షేర్ చేస్తూ..ఇది నా స్వంత పెళ్లి.. కానీ నేను వెళ్లలేకపోతున్నాను..ఏం చేయాలి యార్ అంటూ రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు రకరకాలుగా స్పందించారు. ఓ యూజర్ ..అతను త్వరగా వివాహం చేసుకోవాలని, అతని సమస్యలన్నీ శాంతియుతంగా పరిష్కారమవ్వాలని, విమానాశ్రయాలలో చిక్కుకున్న ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని ప్రార్థిస్తున్నాను అంటూ స్పందించారు.

# ఐటీ, మౌలిక సదుపాయాలకు మద్దతివ్వండి

అమరావతి,మంత్రి నారా లోకేష్ అమెరికా పర్యటన విజయవంతంగా కొనసాగుతోంది. ప్రముఖ కంపెనీల సీఈవోలు, ప్రతినిధులతో మంత్రి వరుసగా భేటీ అవుతున్నారు. ఇందులో భాగంగా ఓప్స్ ర్యాంప్ సీఈవో వర్మతో భేటీ అయిన మంత్రి లోకేష్.. ఐటీ మౌలిక సదుపాయాలకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఏపీలో స్మార్ట్ సిటీలు, డిజిటల్ గవర్నెన్స్, ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్‌ల కోసం ఐటీ మౌలిక సదుపాయాల ఆధునీకరణకు మద్దతు ఇవ్వాలని వినతి చేశారు. ఏఐ ఓప్స్ శిక్షణ, ఇంటర్న్ షిప్‌లు, ఆర్ అండ్ డి సహకారం కోసం ఏపీ టెక్ అకడమియాతో భాగస్వామ్యం వహించాలని కోరారు. స్కేలబుల్ స్యాస్ మోడల్స్ ద్వారా ఐటీ కార్యకలాపాల నిర్వహణతో పాటు ఏపీలో ఎస్ఎంఈలు, స్టార్టప్‌లను ప్రారంభించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. ప్రపంచవ్యాప్తంగా తమ సంస్థకు 500o సంస్థలు కస్టమర్లుగా ఉన్నాయని తెలిపారు. వీటిలో ఫైనాన్స్, హెల్త్‌కేర్, రిటైల్, టెక్నాలజీలో పాటు ఫార్చ్యూన్ సహా 500 కంపెనీలు ఉన్నాయని వెల్లడించారు. భారతదేశంలోని బెంగళూరు, హైదరాబాద్‌లో ప్రధాన కేంద్రాల ద్వారా ఏఐ ఓప్స్, క్లౌడ్ నేటివ్ మానిటరింగ్‌లో ఆవిష్కరణలను ముందుకు తెస్తున్నామని చెప్పుకొచ్చారు. ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఓప్స్ ర్యాంప్ సీఈవో వర్మ పేర్కొన్నారు.అంతకు ముందు అంతర్జాతీయస్థాయి వెంచర్ క్యాపిటల్ సంస్థ సెలెస్టా వీసీ మేనేజింగ్ పార్ట్‌నర్ అరుణ్ కుమార్‌ను మంత్రి లోకేష్ కలిశారు. విశాఖనగరం ఐటీ, డేటా హబ్‌గా శరవేగంగా అభివృద్ధి చెందుతోందని.. ఆంధ్రప్రదేశ్‌లో సెలెస్టా క్యాపిటల్ డీప్ టెక్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయాలని కోరారు. సెమీ కండక్టర్, ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని అన్నారు. కంపెనీలకు ఏపీ ప్రభుత్వం దేశంలోనే అత్యుత్తమైన సమగ్ర ప్రోత్సాహకాలను అందిస్తోందని వివరించారు. పరిశ్రమలకు నిరి?త సమయంలో నేరుగా ప్రోత్సాహకాలను అందించేందుకు దేశంలోనే తొలిసారిగా ఎస్క్రో ఎకౌంట్ విధానాన్ని ప్రారంభించనునట్లు మంత్రి లోకేష్ వెల్లడించారు. తాము ప్రధానంగా యూఎస్, ఇండియా, ఇజ్రాయెల్, ఆగ్నేయాసియా దేశాలపై దృష్టిసారిస్తున్నామని సెలెస్టా వీసీ మేనేజింగ్ పార్ట్‌నర్ అరుణ్ కుమార్ తెలిపారు. సెమీకండక్టర్లు, ఏఐ, రోబోటిక్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి డీప్ టెక్ రంగాలు, సాస్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ లాంటి ఎంటర్ ప్రైజింగ్ సాఫ్ట్ వేర్, గ్లోబల్ మార్కెట్‌లను అనుసంధానించే స్టార్టప్‌లలో పెట్టుబడులకు తాము ప్రాధాన్యతనిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని అరుణ్ కుమార్ వెల్లడించారు.

# శ్రీవారి దర్శనం ఇక మరింత సులభం

అమరావతి,శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు మరింత మెరుగైన, వేగవంతమైన సేవలు అందించేందుకు టీటీడీ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (%ూ×%) ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను (ఐసీసీసీ) అందుబాటులోకి తెచ్చింది. ఇటీవలే బ్రహ్మోత్సవాల సందరరేగా సీఎం చంద్రబాబు ఈ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కొత్త వ్యవస్థ ద్వారా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలో భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. ఏ కంపార్ట్‌మెంట్‌లో భక్తులు ఎంతసేపటి నుంచి వేచి ఉన్నారనే వివరాలను ఏఐ టెక్నాలజీతో గుర్తిస్తారు. ఎక్కువసేపు నిరీక్షిస్తున్న వారికి ప్రాధాన్యతనిచ్చి, వారిని త్వరగా దర్శనానికి పంపేలా చర్యలు తీసుకుంటారని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్‌వో మురళీకృష? వివరించారు. భక్తులు క్యూలైన్‌లోకి ప్రవేశించినప్పటి నుంచి దర్శనం పూర్తయ్యే వరకు పూర్తి సమాచారం డాష్‌బోర్డులో కనిపిస్తుంది. దర్శనమే కాకుండా, అన్నప్రసాదాల వితరణను కూడా ఈ కేంద్రం సమర్థవంతంగా నిర్వహిస్తుంది. ఎంతమంది భక్తులకు అన్నప్రసాదం అందించారు, ఇంకా ఎంతమందికి అవసరం అనే వివరాలను తెలుసుకుని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తుంది. భద్రతను పెంచేందుకు 250 ఫేస్ రికగ్నిషన్ కెమెరాలను కొనుగోలు చేయనున్నారు. నేర చరిత్ర ఉన్నవారి డేటాను దీనికి అనుసంధానం చేసి, అనుమానితులను సులువుగా గుర్తించేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే తిరుమలకు వచ్చే వాహనాల సమాచారాన్ని పర్యవేక్షిస్తూ, కాలుష్య నియంత్రణకు పాత వాహనాలను నిలిపివేయనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే రూ.16 కోట్లు ఖర్చు చేయగా, మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.30 కోట్లకు చేరుతుందని అంచనా. ఏడుగురు దాతలు ఈ కేంద్రం నిర్మాణానికి సహకారం అందించారు. ఏడాది పాటు దీని నిర్వహణ బాధ్యతలను కూడా వారే చూసుకోనున్నారు. మొత్తం మీద భక్తులకు ఈ ఆధునిక సాంకేతికతతో తిరుమలలో పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించాలని టీటీడీ లక్ష్యంగా పెట్టుకుంది.

# లారీలు ఢీకొని డ్రైవర్ సజీవ దహనం

బెస్తవారిపేట,ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. బెస్తవారిపేట మండలం పెంచికలపాడు వద్ద రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ దురెటనలో ఒక లారీ డ్రైవర్ క్యాబిన్‌లోనే చిక్కుకుపోయి మంటల్లో కాలి సజీవ దహనమయ్యారు. వివరాల్లోకి వెళ్తే, అనంతపురం నుంచి టమాటా లోడ్‌తో రాజమండ్రికి వెళ్తున్న లారీ పెంచికలపాడు వద్దకు రాగానే టైరు ఒక్కసారిగా పేలిపోయింది. దీనితో లారీ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు టమాటా లారీ బోల్తా పడగా, ఆయిల్ ట్యాంకర్ ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనలో ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ పైడికొండల దుర్గారావు (40) క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయాడు. ఆ వెంటనే లారీలో మంటలు చెలరేగి వేగంగా వ్యాపించాయి. దీంతో అతను అక్కడికక్కడే సజీవ దహనమయ్యాడు. మ ృతుడిని పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లి వాసిగా గుర్తించారు. విశాఖ సమీపంలోని పరవాడ నుంచి చమురు లోడ్ చేసుకుని తాడిపత్రిలోని ఒక సిమెంట్ పరిశ్రమకు వెళుతుండగా ఈ విషాదం జరిగింది. సమాచారం అందుకున్న గిద్దలూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సౌదీలో మద్యం అమ్మకాలపై నిబంధనల సడలింపు

న్యూఢిల్లీ,సౌదీ అరేబియా ప్రభుత్వం మద్యం అమ్మకాల విషయంలో మరో కీలక నిర?యం తీసుకుంది. దేశంలో నివసిస్తున్న ముస్లిమేతర విదేశీయులకు మద్యం కొనుగోలు చేసేందుకు మరిన్ని సడలింపులు ఇచ్చింది. నెలకు 50,000 రియాళ్లు (సుమారు 13,300 డాలర్లు) లేదా అంతకంటే ఎక్కువ జీతం ఉన్నవారు ఇప్పుడు మద్యం కొనుగోలు చేయవచ్చు. ఈ నిబంధన ప్రకారం, అర్హులైన విదేశీయులు తమ జీతం వివరాలను ధ్రువీకరించే సర్టిఫికెట్‌ను చూపించి, రాజధాని రియాద్‌లో ఉన్న ఏకైక మద్యం విక్రయ కేంద్రంలోకి ప్రవేశం పొందాల్సి ఉంటుంది. గత ఏడాది విదేశీ దౌత్యవేత్తల కోసం ప్రారంభమైన ఈ స్టోర్‌లోకి,

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

న్యూఢిల్లీ,రూపాయి బలహీనత ఎఫెక్ట్‌తో బంగారం, వెండి ధరలు భగభగ మండిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా బంగారం ధరలు లక్షా 30 వేల మార్క్ దాటి పరుగులు పెడుతున్నాయి.. ఇటీవల తగ్గినట్లే తగ్గిన పసిడి ధరలు.. మళ్లీ పెరుగుతూ రికార్డు స్థాయికి చేరుకుంటుండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. అంతర్జాతీయంగా బంగారం ధరలు పెరుగుతుండటంతో.. దేశీయంగా కూడా పెరుగుతున్నాయని బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. తాజాగా.. గోల్డ్ ధర తగ్గగా.. సిల్వర్ ధర పెరిగింది.. పలు వెబ్‌సైట్ల ఆధారంగా.. నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా బంగారం, వెండి రేట్లు ఈ కింది విధంగా ఉన్నాయి. హైదరాబాద్‌లో బంగారం 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,30,090 ఉంది.. 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,19,250 ఉంది. వెండి కిలో ధర రూ.1,99,000 ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,30,090, 22 క్యారెట్ల ధర రూ.1,19,250 ఉంది. కిలో వెండి ధర రూ.1,99,000 ఉంది. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,30,240, 22 క్యారెట్ల ధర రూ.1,19,400 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,90,000 ఉంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,30,090, 22 క్యారెట్ల ధర రూ.1,19,250 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,90,000 లుగా ఉంది. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,30,910.. 22 క్యారెట్ల ధర రూ.1,20,000 ఉంది. వెండి కిలో ధర రూ.1,99,000 లుగా ఉంది. బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.1,30,090, 22 క్యారెట్లు రూ.1,19,250 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,90,000 లుగా ఉంది. కాగా.. బంగారం, వెండి ధరలు అన్ని నగరాల్లో ఒకే విధంగా ఉండవు. స్థానిక డిమాండ్, సరఫరా, అలాగే రాష్ట్ర పన్నులు, తదితర అంశాల ప్రకారం ఎప్పటికప్పుడు మారుతుంటాయి.. అందుకే అన్ని ప్రధాన నగరాల్లో కూడా ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి. ఒకవేళ మీకు బంగారం, వెండి ధరల లేటెస్ట్ అప్‌డేట్ గురించి తెలుసుకోవాలంటే ఈ మొబైల్ నెంబర్‌కు 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు.

# జగన్ కు కషాయం!

అమరావతి,రాజకీయాలకు అలవాటు పడిన నాయకులు వాటిని వదులుకోవడానికి ఇష్టపడరు. ఏదో ఆవేశంలో రాజకీయ వైరాగ్యం కలిగినా, మరీ ఆవేశపడి రాజకీయ సన్యాసం తీసుకున్నానంటూ ప్రకటనలు చేసేసినా.. ఆ ఆవేశం తగ్గాకా మళ్లీ వాళ్ల చూపు రాజకీయలవైపే అంటుంది. అడుగులు కూడా రాజకీయం వైపే పడతాయి. ఒక లగడపాటి రాజగోపాల్ అయినా, మరో ఉండవల్లి అరుణ్ కుమార్ అయినా.. ఇంకో వడ్డే శోభనాదీశ్వరరావైనా అంతే. అవకాశం లేక, జనం మెచ్చక, ఒప్పక వీరంతా రాజకీయ ప్రకటనలకే పరిమితమయ్యారు. అయితే విజయసాయిరెడ్డి పరిస్థితి అది కాదు. విజయసాయి అవేశంతో కంటే ఎంతో ఆలోచనతో రాజకీయ సన్యాసం ప్రకటించి, వ్యవసాయమే తన వ్యాపకం అని ప్రకటించేశారు. అలా ప్రకటించిన సందర్భంలోనే పరిశీలకులు ఇది వ్యూహాత్మక పొలిటికల్ రిటైర్మెంట్ అంటూ విశ్లేషణలు చేశారు. ఎందుకంటే.. వైసీపీలో ఒక సమయంలో ఆయన జగన్ తరువాత జగనంతటి నాయకుడిగా వెలుగొందారు. ఆయన రాజకీయ సన్యాసం ప్రకటించిన సమయంలో రాజకీయంగానే కాదు, కేసుల పరంగా కూడా నిండా మునిగి ఉన్నారు. ఇంత కాలం తన సర్వస్వం ధారపోసి పెంచిన పార్టీ దూరం పెట్టింది. అదే సమయంలో కేసులూ చుట్టుముట్టాయి. ఆ కేసుల నుంచి బయటపడాలంటే.. వైసీపీకి తాను దూరం అని నిరూపించుకోవాలి. అదే సమయంలో.. తన స్వేదంతో పెంచిన పార్టీలో.. తన ఉనికినే ప్రశ్నార్థకం చేసిన వారిపై ప్రతీకారం తీర్చుకోవాలి. అందుకు అవకాశం రావాలంటే.. పొలిటికల్ గా తాను న్యూట్రల్ గా ఉన్నాననీ, ఉంటాననీ నిరూపించుకోవాలి. అందుకే ఆ సమయంలో విజయసాయి రాజకీయ సన్యాసం పుచ్చుకుంటున్నట్లుగా ప్రకటించారని పరిశీలకులు విశ్లేషించారు. వారి విశ్లేషణలకు తగ్గట్టుగానే ఆయన వ్యవసాయమే వ్యాపకం అని ప్రకటించినా, సోషల్ మీడియా ద్వారా, చేయగలిగినంత రాజకీయం చేశారు. అలాగే కేసుల విచారణకు హాజరైన సందర్భంగా మీడియా ముందూ రాజకీయాలే మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో అరెస్టులకు ఆయన ఇచ్చిన లీకులే కారణమంటే అతిశయోక్తి కాదు. విజయసాయి వైసీపీ నుంచి బయటకు వచ్చి, రాజకీయ సన్యాసం ప్రకటించిన తరువాత ఆయన మాటలు, చేతలు, అడుగులూ అన్నీ బయటకు జగన్ కోటరీ టార్గెట్ అన్నట్లు కనిపించినా.. ఆయన అసలు లక్ష్యం జగన్ అన్నట్లుగానే సాగాయి. అంతెందుకు విజయసాయి వైసీపీకి గుడ్ బై చెప్పిన తరువాత హైదరాబాద్ వెళ్లి మరీ జగన్ సోదరి షర్మిలతో భేటీ అయ్యారు. ఆ తరువాత కూడా విజయసాయి పొలిటికల్ గా బీజేపీకి చేరువ అవుతున్నారన్న ప్రచారం జరిగింది. ఇప్పుడు ఆ ప్రచారాలకీ, ఆ విశ్లేషణలకూ బలం చేకూర్చే విధంగా హిందుత్వకు మద్దతుగా ఆయన తన గళం వినిపించారు. అదీ అలా ఇలా కాదు.. వైసీపీ పునాదులే కదిలిపోయేంత గట్టిగా విజయసాయి బాం బు పేల్చారు. మొత్తంగా గత రెండు దశాబ్దాలుగా జరిగిన మతమార్పిడులపై విచారణ జరిపించాలనీ, ఇందుకు ఒక కమిటీని వేయాలని విజయసాయి డిమాండ్ చేశారు. హిందుత్వకు ద్రోహం చేసిన వారిని ఎవరినీ విడిచిపెట్టకూడదని ఉద్ఘాటించారు. ఈ మాటల వెనుక ఆయన ఆయన ప్రధాన టార్గెట్ వైసీపీ అండ్ జగన్ అని ఎవరికైనా ఇట్టే అర్థమైపోతుందంటారు పరిశీలకులు. గత రెండు దశాబ్దాలుగా అంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్న కాలం నుంచి ఇప్పటి వరకూ జరిగిన మతమార్పిడులపై విచారణ జరిపించాలన్నది ఆయన చేసిన డిమాండ్. వైఎస్ జమానాలో క్రైస్తవ మతంలోకి పెద్ద ఎత్తున మతమార్పిడులు జరగిన విషయం అందరికీ తెలి సిందే. ఇప్పుడు విజయసాయిరెడ్డి డిమాండ్ ద్వారా బీజేపీకి పదునైన ఆయుధాన్ని అందించారని అంటున్నారు విశ్లేషకులు. ఇప్పుడు విజయసాయి ప్రత్యక్ష రాజకీయాలలో లేకపోవచ్చు కానీ, బీజేపీ గొంతుక వినిపించారు. తద్వారా తన అడుగులు ఎటు అన్న సంకేతాలు ఇచ్చారు. విజయసాయి కాషాయం పుచ్చుకుంటే.. జగన్ కు ఇక గడ్డుకాలమేనన్నది పరిశీలకుల విశ్లేషణ

## శునకం వివాదంపై బీజేపీ సీరియస్

న్యూఢిల్లీ,కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరిపై వచ్చిన హక్కుల ఉల్లంఘన నోటీసును రాజ్యసభ ఛైర్మన్ ప్రివిలేజ్ కమిటీకి పంపించారు. పార్లమెంట్ ప్రాంగణంలోకి శునకాన్ని తీసుకువచ్చి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ సభ్యులు ఇచ్చిన నోటీసుపై విచారణ జరపాలని కమిటీని ఆదేశించారు. ఇటీవల పార్లమెంట్ సమావేశాల ప్రారంభం రోజున రేణుకా చౌదరి తన వాహనంలో ఓ శునకాన్ని తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఆమె చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆమె ప్రవర్తన సభా హక్కులను ఉల్లంఘించడమేనని ఆరోపిస్తూ బీజేపీ సభ్యులు బ్రిజ్ లాల్, ఇందు బాలగోస్వామి రాజ్యసభ ఛైర్మన్‌కు ప్రివిలేజ్ నోటీసులు అందజేశారు. ఈ నోటీసును పరిశీలించిన ఛైర్మన్, తదుపరి విచారణ నిమిత్తం హక్కుల కమిటీకి (ప్రివిలేజ్ కమిటీ) పంపారు.


# గ్యారంటీ లేని 'ఉపాధి'

హైదరాబాద్,మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (రేగా) వచ్చి ఇరవై ఏళ్లయింది. గ్రామీణ పేద వ్యవసాయ శ్రామికులకు సంవత్సరంలో కనీసం వంద రోజుల పని కల్పనకు గ్యారంటీ చేసిన 'రేగా' స్ఫూర్తిని మోడీ ప్రభుత్వం తన పదేళ్ల జమానాలో అంతకంతకూ నిర్వీర్యం కావించడం ఆందోళనకర విషయం. పనుల్లేని సమయాల్లో ఉపాధి హామీ ద్వారా కొన్ని రోజుల్లోనైనా పేదల కడుపు నింపుతున్న చట్టానికి తూట్లు పొడిచి వారి పొట్ట కొట్టడం కేంద్ర ప్రభుత్వం మూటగట్టుకున్న దుర్మార్గం. ఉపాధి హామీపై మోడీ సర్కార్ రచిస్తున్న కుట్రలను వామపక్షాలు, ప్రజాసంఘాలు, ఎన్‌జిఒలు, పలు అధ్యయన సంస్థలు, సామాజిక కార్యకర్తలు ఎప్పటికప్పుడు వెలుగులోకితెచ్చి ఎండగడుతున్నా వెనక్కితగ్గేదేలే.. అంటోంది. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో రేగా పరిస్థితి ఎంత అన్యాయంగా ఉందో 'లిబ్‌టెక్' సంస్థ కుండబద్దలు కొట్టింది. ఈ దుస్థితి మన ఒక్క రాష్ట్రానికే కాదు పలు బిజెపి పాలక రాష్ట్రాల్లో కొనసాగుతోంది. దేశంలో 12 కోట్ల మంది పేదలకు జాబ్ కార్డులు జారీ చేయగా వాటిలో యాక్టివ్‌గా ఉన్నవి ఐదున్నర కోట్లు మాత్రమే. ఒక్క ఏడాదిలో జాబ్‌కార్డుల సంఖ్య అమాంతం మూడున్నర కోట్లకు తగ్గిపోయింది. కోట్లలో జాబ్‌కార్డులు తగ్గిపోయాయంటే ఉపాధి హామీ చట్టం అమలు ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. ఆ ప్రభావం గ్రామీణ పేదల ఉపాధిపై కచ్చితంగా పడుతుంది. యుపిఎ-1 ప్రభుత్వంలో వామపక్షాల ఒత్తిడితో 2005లో ఈ చట్టం రాగా 2006 సెప్టెంబర్‌లో 200 జిల్లాల్లో ప్రారంభించి 2008 నుంచి అన్ని జిల్లాలకు విస్తరించారు. 2008-09 బడ్జెట్‌లో రేగాకు ఖర్చు చేసింది రూ. 27 వేల కోట్లు. అప్పుడు కేంద్రం మొత్తం వార్షిక బడ్జెట్ రూ.6 లక్షల కోట్లు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం బడ్జెట్ రూ.50 లక్షల కోట్లు కాగా ఉపాధి హామీకి మోడీ ప్రభుత్వం ప్రతిపాదించింది 86 వేల కోట్లు మాత్రమే. అప్పటికి ఇప్పటికి బడ్జెట్ దాదాపు 8 రెట్లు పెరిగింది. ఆ దామాషాలో ఉపాధి హామీకి కనీసం రెండు లక్షల కోట్లు కేటాయించాలి. కానీ బిజెపి ప్రభుత్వం లక్ష కోట్లు కూడా కేటాయించలేదు. కేటాయించిన నిధులు పాత బకాయిలకు, మెటీరియల్ కాంపొనెంట్‌కు సరిపోతే ఇక కూలీలకు పనులు, వేతనాలు ఎక్కడీ అప్పటికి ఇప్పటికి జనాభా 20-30 కోట్ల వరకు పెరిగింది. గ్రామీణ పేదలకు ఉపాధి హామీ స్వల్పమేనని తెలుస్తుంది. మోడీ సర్కార్ వల్లించే వికసిత్ భారత్, సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్, జిడిపి వృద్ధి.. వగైరా వగైరా పేదలనుద్దేశించి కాదు కార్పొరేట్లు, సంపన్నుల కోసమని రూఢి అవుతుంది. కరోనా ఏడాది ప్రజల నుంచి వచ్చిన డిమాండ్ మేరకు లక్ష కోట్లకుపైన కేంద్ర ప్రభుత్వం ఉపాధి



హామీకి వ్యయం చేసింది. కరోనా సమస్య వీడినా వ్యవసాయ సంక్షోభం, భారీ యాంత్రీకరణ, అర్బన్‌లో ఉపాధికి ఒత్తిడి వెరసి గ్రామాల్లో ఉపాధి లేక పేదలు అవస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితులు ఉపాధి హామీ పనులకు డిమాండ్ పెంచుతున్నాయి. ఇదే సమయంలో ఆధార్, ఇకెవైసి వంటి సాంకేతిక కారణాలు చూపి పేదలను 'ఉపాధి'కి దూరం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు రాష్ట్రంలో ఉపాధి హామీని క్షీణింపజేస్తున్నాయని ఈ కాలంలో పని దినాలు, పనులు చేస్తున్న శ్రామికుల తగ్గుదల తెలుపుతున్నాయి. గతేడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఎనిమిది నెలల్లో ఎస్‌సిలకు కల్పించిన పని దినాలు 5.23 కోట్లు కాగా ఈ సంవత్సరం 3.30 కోట్లకు తగ్గాయి. ఇదే సమయంలో ఎస్‌టిలకు పని దినాలు 3 కోట్ల నుంచి 1.88 కోట్లకు తగ్గాయి. ఎస్‌సిల పని దినాలు 18.7 శాతం, ఎస్‌టిలకు 17 శాతం, మొత్తం పేదలకు 13.6 శాతం తగ్గాయి. పని దినాలు ఆ మేరకు తగ్గితే ఉపాధి పొందే వారి సంఖ్యా తగ్గుతుంది. వంద రోజుల పని పూర్తి చేసుకున్న కుటుంబాలను వేళ్లపై లెక్కించొచ్చు. సాంకేతిక కారణాలతో లక్షల్లో జాబ్ కార్డుల తొలగింపు ఉండనే ఉంది. వేతనాల చెల్లింపులకు రాష్ట్రంలో విధించిన ఆంక్షలు కఠినంగా ఉన్నాయి. రోజుకు కనీస వేతనం రూ.320 దక్కాల్సింది అంతకంటే తక్కువ అందుతోంది. వాటి కోసం కొన్ని నెలలు నిరీక్షించాల్సి వస్తోంది. గ్రామీణ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో ఏడాదిలో 200 రోజుల పనికి గ్యారంటీ, రోజుకు కనీస వేతనర 600 ఇవ్వాలన్న కార్మికుల కోర్కె సహేతుకమైనది. పట్టణ ప్రాంతాలకూ ఉపాధి హామీని విస్తరించాలన్న డిమాండ్ ఆలోచింపదగినది. పేదల కొనుగోలు శక్తి పెంచేందుకు, తద్వారా జిడిపి వృద్ధికి ఉపాధి హామీ వంటివి తోడ్పడతాయి. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులేయడం అవసరం.

# తెలంగాణ బీజేపీలో కుమ్ములాటలు




హైదరాబాద్, తెలంగాణ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ నిర్వహించిన మహాధర్నా మరో పంచాయితీని తెచ్చిపెట్టిందా? ప్రజా పోరాటాల కన్నా, ఇన్ సైడ్ పోరాటాలకే నేతలు ప్రాధాన్యతనిస్తున్నారా? పార్టీలో రామ చందర్ రావుతో ఎలాంటి విభేదాలు లేవంటూనే వేదికపై మాటల మంటలను నేతలు ఎందుకు రాజేశారు? ఫార్మాట్ మార్చాలంటారు కొందరు.. అంతా బాగుందంటూనే అసలు మొఖమే ఎందుకు చూపించడం లేదు.. ? అసలు బీజేపీ నేతలకు ఏమైంది?

తగ్గేదేలే అంటున్న కమలనాథులు

తెలంగాణ బీజేపీలో కుమ్ములాటలు, అసమ్మతికి ఎండ్ కార్డ్ పడటం లేదు. స్థానిక సీనియర్ నేతలు సర్ది చెప్పినా.. జాతీయ నేతలు నేరుగా వచ్చి స్పెషల్ క్లాస్‌లు తీసుకున్నా.. అస్సలు తగ్గేదేలే అంటున్నారు కమలనాథులు. దీంతో పార్టీ వివాదాలకు కేరాఫ్‌గా మారుతోంది. ఇన్నాళ్లు అంతర్గతంగా ఎప్పుడూ.. బహిర్గతంగా అప్పుడప్పుడు వివాదాలు కొనసాగేవి కమలనాథుల మధ్య. కానీ ఇప్పుడు ఇందిరాపార్క్ వేదికగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ధర్నాలోనే ఫేస్ టు ఫేస్ కౌంటర్లు వేసుకున్నారు కాషాయ పార్టీ నేతలు.

మహాధర్నా.. కీలక నేతలు గైర్హాజరు

మున్సిపాలిటీల విలీనం, భూముల బదాలాయింపు హిల్ట్ పాలసీకి వ్యతిరేఖంగా మహధర్నా అన్నారు.. కానీ ధర్నా సమయానికి రూటు మారింది. రూటు మారిన సరే, మహాధర్నాకు కీలక నేతలు ఎందుకు గైర్హాజరు అయినట్టు అనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. పార్టీ చేపట్టిన మహాధర్నా ప్రోగ్రాం కంటే ఆ నేతలకు అంతకన్న పెద్ద ముఖ్యమైన విషయాలు ఏంటనేది అర్థం కాని విషయం. అసలు బీఎల్ సంతోష్ ట్రీట్‌మెంట్ నేతలకు సరిపోలేదా? నేతల మధ్య విభేదాలంటూ తప్పుడు రాతలు రాయొద్దంటూ రామచందర్ రావు కామెంట్లు దేనికి సంకేతాలు? అందరు రావాలనే మహధర్నా కార్యక్రమాన్ని ఆదివారం ఏర్పాటు చేసినా కూడా కీలక ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎందుకు దూరంగా ఉన్నట్టు? లోకల్లోనే ఉండి ఈటల రాజేందర్ ధర్నా మొహం కూడా ఎందుకు చూడలేదు? కార్యక్రమం ఉందని తెలిసి కూడా ధర్మపురి ఢిల్లీలోనే ఎందుకు మకాం వేశారు? ఇక్కడ ధర్నా ప్రారంభం అవుతున్న సమయానికే ఢిల్లీలో ఆయన మీడియా సమావేశం ఎందుకు పెట్టారు? ఇలా అన్ని ప్రశ్నలే. అంతేకాదు బండి సంజయ్, రఘునందన్ రావు, గూడెం నగేష్ మొహాలు ఎందుకు కనిపించలేదు అనేది ఇప్పుడు బేతాళ ప్రశ్నలుగా మారాయి.

రామచందర్ రావు అధ్యక్షత్వంలో మహాధర్నా

రామచందర్ రావు అధ్యక్షుడయ్యాక మొదటి అతిపెద్ద కార్యక్రమం ఈ మహాధర్నా. అంతేకాదు రాష్ట్ర నూతన అధ్యక్ష వర్గం ఎన్నికతో పాటు, అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఎల్ సంతోష్ రాష్ట్రానికి తొలిసారి రావడం, నేతలకు దిశానిర్దేశం చేసిన తర్వాత జరిగిన తొలి మహాధర్నా ఇది. జీహెచ్‌ఎంసీ పరిధిలో వున్న 8 జిల్లాల నుంచి జన సమీకరణ చేయాలనుకున్న బీజేపీ, ఆశించిన స్థాయిలో ప్రజలు రాకపోవడం, ప్రజలే కాదు, సొంత పార్టీ కీలక నేతలే డుమ్మా కొట్టడం ఇప్పుడు ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఇంతపెద్ద ధర్నాకు పార్టీ పిలుపునిస్తే, జన సమీకరణలో విఫలం, కీలక నేతలు డుమ్మకొట్టడం, బీఎల్ సంతోష్ వచ్చి నేతలకు పెన్ను పేపర్ ఇచ్చి స్పష్టంగా రూట్ మ్యాప్ ఇచ్చినా, మా రూట్ మ్యాప్ మాకుంది, బీఎల్ సంతోష్ ఎవరు..? రామచందర్ రావు ఎవరు.. ? అన్న మూడ్ లోనే నేతలంతా ఉన్నట్టుగా ఈ మహాధర్నా కనిపించింది. ఇదంతా అటుంచితే.. తమ మీద వార్తలు రాయించడం కాదు.. లోకల్‌లో ఉండి బండి సంజయ్ ఈ ధర్నాకు ఎందుకు దూరంగా ఉన్నారో వార్తలు రాయించే దమ్ము ఉందా అంటూ అర్వింద్, ఈటల, కొండ విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందన్ రావు వర్గాలు ప్రశ్నిస్తున్నాయట.

ధర్నా వేదికగా రామచందర్ రావు టార్గెట్

ధర్నా వేదికగా పైడి రాకేష్ రెడ్డి పార్టీ చీఫ్ రామచందర్ రావును టార్గెట్ ఎందుకు చేశారనేది మరో కొత్త టాపిక్‌గా మారింది. ఫార్మాట్ చేంజ్ చేసుకోవాలని వార్నింగ్ ఇచ్చారా..? సూచన చేశారా..? 50,50 వన్డే మ్యాచ్ పనికి రాదని, ఆది ఔట్ డేటెడ్ గేమ్ అని, రామ చందర్ రావు 20, 20 ఫార్మాట్ లోకి రావాలని, లేకపోతే అధికారం కలగానే మిగిలిపోతుందన్నారు ఆయన. ఈ వ్యాఖ్యలు పైడినే మాట్లాడారా? లేక అర్వింద్ నూరి పోసి పైడి రాకేష్ రెడ్డిని పంపించారా అన్న టాక్ ఆ పార్టీలో నడుస్తోంది. పాత నేతలను దృష్టిలో పెట్టుకొని పైడి రాకేష్ రెడ్డితో అర్వింద్ ఇలాంటి వాఖ్యలు చేయించారనే టాక్ సైతం నడుస్తోంది. ఫిఫ్టీ ఫిఫ్టీ అంటే పాత నేతలని.. ట్వంటి ట్వంటీ నేతలు అంటే కొత్త నేతలను.. పాత వారిని కాస్త పక్కన పెట్టి.. కొత్త నేతలతో ముందుకు వెళితే పార్టీ గెలుస్తుందనే సంకేతాన్ని ఇవ్వాలని చూశారనే టాక్ నడుస్తోంది. అసలు సంస్థాగతంగా మాట్లాడాల్సిన అంశాలు.. ఇలా బహిరంగంగా.. అందరూ ఉన్న వేదికపై మాట్లాడటం.. అది కూడా నేరుగా అధ్యక్షుడిని టార్గెట్ చేయడం చూస్తుంటే అంతర్గత పోరు పీక్స్‌కు చేరినట్టు క్లియర్‌కట్‌గా తెలుస్తోంది. అంతేకాదు అర్వింద్, ఈటల రాజేందర్, కొండా, రఘునందన్, ఏలేటి, వెంకటరమణ రెడ్డి, పైడి రాకేష్, పాయల్ శంకర్‌ల వ్యవహారం ఇప్పుడు చాలా మంది నేతలకు నచ్చడం లేదనే టాక్ వినిపిస్తోంది.

రాష్ట్ర బీజేపీ నేతల్లో గందరగోళం

అంతేకాదు హిల్ట్ భూముల పంచాయితీ రాష్ట్ర బీజేపీ తలపెట్టిన మహాధర్నా రూపు రేఖలే మార్చేశాయట. ముందుగా మున్సిపాలిటీల విలీన%శీ%, హిల్ట్ పాలసీపై మాత్రమే మహాధర్నా ఉంటుందని రాష్ట్ర నాయకత్వం ప్రకటించింది. కానీ తీర ఆ పార్టీలో మెజారిటీ నేతలు ఈ మహాధర్నాను వ్యతిరేకించడంతో యూ టర్న్ తీసుకొని అప్పటికప్పుడే ప్రభుత్వ ఆరు గ్యారెంటీలపై ప్రజావంచన పేరుతో ధర్నాను సాగించారు. నగరం నడిబొడ్డున ఉన్న పారిశ్రామిక వాడలను నగర అవతలకు తరలిస్తే తప్పేంటని కొంతమంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాష్ట్ర నాయకత్వాన్ని ప్రశ్నిస్తున్నారట. కమలం పార్టీలో హిల్ట్ పాలసీని వ్యతిరేకిస్తున్నవారు కొందరైతే, సమర్థించేవారు మరికొందరు ఉండటంతో రాష్ట్ర నాయకత్వం తలలు పట్టుకుంటుందట. హిల్ట్‌లో మతలబ్ అర్థం కాకా ఉన్నపలంగా అధికార పార్టీ రెండేళ్ల ప్రజా పాలన విజయోత్సవాలను నిర్వహిస్తున్న సందర్భంలో దానికి దీటుగా ప్రజావంచన పేరుతో మహాధర్నా, రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు అంటూ ఇందిరాపార్క్ వేదికగా ప్రకటన చేయడం వెనక బీజేపీ ఉద్దేశం ఎంటో అర్థం కాక పార్టీ శ్రేణులు తలలు పట్టుకుంటున్నారట.

కీలక నేతలు విమర్శలు

మున్సిపాలిటీల విలీనం అన్నారు, HILT పాలసీపై అవినీతి అన్నారు, 8 జిల్లాల జనసమీకరణ అన్నారు, వాటి మీదే మహాధర్నా అన్నారు.. చివరకు ఆరు గ్యారెంటీలపై ధర్నా చేయడం మున్సిపాలిటీల విలీనం, HILT పాలసీలపై బీజేపీ వెనకడుగు వేసిందా అనే చర్చ ఆ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. అంతేకాదు పారిశ్రామిక వాడల్లో పెద్ద మొత్తంలో బీజేపీలో కొంత మంది ఎంపీలకు, ఎమ్మెల్సీలకు భూలున్నాయయనే టాక్ పొలిటికల్ సర్కిల్లో నడుస్తోంది. అందులో భాగంగానే హిల్ట్‌పై కొంతమంది కీలక నేతలు మౌనం వహిస్తున్నారట. మరికొంత మంది నేతలు వ్యతిరేకిస్తున్నారట. ఇంకొంత మంది సమర్థిస్తున్నారట. హిల్ట్‌పై ఏలేటి మహేశ్వర్ రెడ్డి, కిషన్ రెడ్డి, డీకే అరుణలు మాత్రమే విమర్శలు చేస్తున్నారు. మిగతా మెజారిటీ నేతలు స్పందించడం లేదనే టాక్ ఉంది. మొత్త మీద హిల్ట్ పాలసీ రాష్ట్ర బీజేపీలో మరొ కొత్త పంచాయతీని తెచ్చిపెట్టిందన్న చర్చ జరుగుతుంది. ప్రభుత్వ తీసుకొన్చిన పాలసీ ఎఫెక్ట్ రాష్ట్ర బీజేపీలో రిఫ్లెక్ట్ అవుతున్న పరిస్థితుల నుంచి ఆ పార్టీ నేతలు ఏ విధంగా బయటపడతారో చూడాలి.

## తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,ఎమ్మెల్యే హుమాయున్ కబీర్ తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలవడం ఇదేం కొత్త కాదు. మొన్నటికి మొన్న.. తృణమూల్ కాంగ్రెస్ ముస్లిం ఓటు బ్యాంకు ముగిసిపోతుందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'పిక్చర్ అభి బాకీ హై' అంటూ కామెంట్లు చేయడం వివాదాస్పదంగా మారింది. హుమాయున్ కబీర్ నుంచి బాబ్రీ మసీదు ప్రకటన వెలువడిన వెంటనే పార్టీ నుంచి ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్టు టీఎంసీ ఓ ప్రకటన జారీ చేసింది. దీంతో డిసెంబర్ 22న కొత్త పార్టీని ఏర్పాటు చేయనున్నట్టు కబీర్ వెల్లడించారు.

# సాంబారు పాత్రలో పడి బాలుడి దుర్మరణం

హైదరాబాద్,నాలుగేళ్ల బాలుడు ప్రమాదవశాత్తూ వేడి సాంబారు పాత్రలో పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కన్నుమూశాడు. తెల్లారితే బాబు పుట్టిన రోజు వేడుక జరుపుకోవాల్సిన తరుణంలో కొడుకు మరణించడంతో తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని మల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఈ విషాద సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు, బాలుడి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా కోటపల్లికి చెందిన మొగిలి మధుకర్ మల్లాపూర్ గురుకుల హాస్టల్ లో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి హాస్టల్ లోని సిబ్బంది కోసం కేటాయించిన క్వార్టర్స్ లో ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం హాస్టల్ లో విద్యార్థుల కోసం మధుకర్ సాంబారు సిద్ధం చేశాడు. మిగతా వంటకాలు సిద్ధం చేస్తుండగా మధుకర్ కొడుకు మోక్షిత్ (4) అక్కడే ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ మోక్షిత్ సాంబారు పాత్రలో పడిపోయాడు. సాంబార్ వేడిగా ఉండడంతో మోక్షిత్ కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మోక్షిత్ ను కరీంనగర్ ఆసుపత్రికి అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ బాలుడు చికిత్స పొందుతూ రాత్రి మ ృతి చెందాడు. సోమవారం మోక్షిత్ బర్త్ డే కావడంతో ఆదివారం సాయంత్రం ధర్మారం వెళ్లాలని మధుకర్ భావించాడు. వంట పనులు త్వరగా పూర్తిచేసుకుని కొడుకు పుట్టిన రోజు కోసం కొత్త దుస్తులు, కేకు, ఇతర సామాగ్రి తీసుకురావాలని అనుకున్నాడు. ఇంతలోనే ఈ దురెటన చోటుచేసుకుంది. పుట్టిన రోజున ఆనందోత్సాహాలతో గడపాల్సిన ఇంటికి బాలుడు విగతజీవిగా రావడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## సర్పంచ్ అభ్యర్థి ఆత్మహత్య

హైదరాబాద్,తెలంగాణలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల ప్రక్రియ తీవ్ర ఒత్తిడితో కూడిన వాతావరణంలో సాగుతోంది. ఈ క్రమంలో పలుచోట్ల విషాదకర సంఘటనలు చోటుచేసుకున్నాయి. సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో ముగ్గురు అభ్యర్థులు మ ృతి చెందగా, సిద్దిపేట జిల్లాలో ఓ అభ్యర్థిపై కేసు నమోదైంది. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం పిప్పడ్‌పల్లి గ్రామ సర్పంచ్‌గా కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేస్తున్న సీహెచ్ రాజు (36) ఆత్మహత్య చేసుకున్నారు. ఎన్నికల్లో ఓడిపోతాననే ఆందోళనతో, నమ్మినవాళ్లే ప్రచారానికి రావడం లేదన్న మనోవేదనతో ఆయన చెట్టుకు ఉరేసుకుని మరణించారు. ఆదివారం రాత్రి తోటి అయ్యప్ప స్వాములతో తన ఆవేదన పంచుకోగా, వారు ధైర్యం చెప్పినప్పటికీ సోమవారం ఉదయం ఆయన విగతజీవిగా కనిపించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరో ఘటనలో రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మంచర్లగూడలో 8వ వార్డుకు పోటీ చేస్తున్న పల్లె లత (42) ప్రచారం నిర్వహిస్తుండగా గుండె నొప్పితో కుప్పకూలిపోయారు. మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే కన్నుమూశారు. అలాగే, సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం చక్రియాల గ్రామంలో 8వ వార్డు అభ్యర్థి కొత్తొల్ల పద్మారావు (50) ఆదివారం రాత్రి ప్రచారం ముగించుకుని ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి నిద్రలోనే గుండెపోటుతో మ ృతి చెందారు. ఆయన మరణంతో ఆ వార్డులో పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య రెండుకు చేరిందని, ఎన్నికలకు ఎలాంటి ఆటంకం లేదని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వంగపల్లిలో సర్పంచ్ అభ్యర్థి చల్ల కమలాకర్ రెడ్డి బాండ్ పేపర్‌పై హామీలు ఇస్తూ ప్రచారం చేస్తున్నారని పేర్కొంటూ, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినందుకు ఆయనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## కాశ్మీర్‌లో చైనా జాతీయుడి అరెస్ట్..

న్యూఢిల్లీ, వీసా నిబంధనలను ఉల్లంఘించి, ఎలాంటి అనుమతి లేకుండా కశ్మీర్, లడఖ్ లలోని అత్యంత కీలకమైన, సున్నితమైన ప్రాంతాల్లో పర్యటించిన చైనా జాతీయుడిని శ్రీనగర్‌లో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్‌ను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. దేశ భద్రతకు సంబంధించిన సున్నిత సమాచారాన్ని ఏమైనా లీక్ చేశాడా? అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. వివరాల్లోకి వెళితే, హూ కాంగ్‌తాయ్ (29) అనే చైనా పౌరుడు నవంబర్ 19న టూరిస్ట్ వీసాపై ఢిల్లీకి వచ్చాడు. నిబంధనల ప్రకారం వారణాసి, ఆగ్రా, జైపూర్, గయ వంటి కొన్ని బౌద్ధ క్షేత్రాలను మాత్రమే అతను సందర్శించాలి. కానీ అతడు ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ లో నమోదు చేసుకోకుండానే లడఖ్‌లోని లేహ్, జన్స్కర్‌తో పాటు కశ్మీర్ లోయలోని పలు వ్యూహాత్మక ప్రాంతాల్లో పర్యటించాడు. జన్స్కర్‌లో మూడు రోజుల పాటు ఉండి, స్థానిక బౌద్ధారామాలతో పాటు వ్యూహాత్మకంగా ముఖ్యమైన ప్రదేశాలను సందర్శించాడు. దక్షిణ కశ్మీర్‌లోని ఆర్మీ విక్టర్ ఫోర్స్ హెడ్ క్వార్టర్స్‌కు సమీపంలో ఉన్న అవంతిపుర బౌద్ధ శిథిలాలతో పాటు హజ్రత్‌బల్ దర్గా, శంకరాచార్య హిల్, దాల్ సరస్సు వంటి ప్రాంతాల్లో అతడి కదలికలు అనుమానాలకు తావిచ్చాయి. భారత్‌కు వచ్చిన వెంటనే బహిరంగ మార్కెట్‌లో ఒక ఇండియన్ సిమ్ కార్డును కూడా సంపాదించడం గమనార్హం. అతడి ఫోన్‌లోని బ్రౌజింగ్ హిస్టరీలో సీఆర్పీఎఫ్ మోహరింపు, ఆర్టికల్ 370 రద్దు వంటి అంశాల గురించి వెతికినట్లు అధికారులు గుర్తించారు. విచారణలో తాను అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీలో ఫిజిక్స్ చదివానని, గత తొమ్మిదేళ్లుగా అక్కడే ఉంటున్నానని హూ కాంగ్‌తాయ్ తెలిపాడు. తనకు ప్రయాణాలంటే ఇష్టమని, వీసా నిబంధనల ఉల్లంఘన గురించి తనకు తెలియదని చెబుతున్నాడు. అతడిని ప్రస్తుతం శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ సమీపంలోని బుద్గాం జిల్లా హుమ్హామా పోలీస్ పోస్టులో విచారిస్తున్నారు. అతడి పర్యటన వెనుక అసలు ఉద్దేశాన్ని రాబట్టేందుకు భద్రతా ఏజెన్సీలు ప్రయత్నిస్తున్నాయి.

## గ్లోబల్ సమ్మిట్ చుట్టూ రాజకీయాలు..

హైదరాబాద్,కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు బీజేపీ జై కొట్టడం వెనుక ఏం జరిగింది? ఓ వైపు ప్రభుత్వాన్ని విమర్శలు చేస్తూనే, మరోవైపు సపోర్టు చేయడం వెనుక కారణమేంటి? దీని వెనుక బీఆర్ఎస్ రాజకీయ కాలిక్యులేషన్స్ ఏ విధంగా ఉన్నాయి? తెలంగాణ వ్యాప్తంగా ఇప్పుడు దీనిపై చర్చ జరుగుతోంది.

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కి బీజేపీ జై

తెలంగాణలో రాజకీయాలు విచిత్రంగా ఉంటున్నాయి. బీజేపీ-బీఆర్ఎస్ ఒక్కటేనని అధికార కాంగ్రెస్ పార్టీ చెబుతుంటే.. కాదు కాంగ్రెస్-బీజేపీ ఒక్కటేనని బీఆర్ఎస్ అంటోంది. తాజాగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ చుట్టూ కొత్త రాజకీయాలు మొదలయ్యాయి. భారత్ ఫ్యూచర్ సిటీలో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'ని అత్యంత ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తోంది రేవంత సర్కార్. తెలంగాణ వచ్చిన తర్వాత తొలిసారి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అతి పెద్ద పెట్టుబడుల కార్యక్రమం తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, ప్రధానిని స్వయంగా ఆహ్వానించింది రేవంత్ సర్కార్. వీరితోపాటు దేశీయ, విదేశీ వ్యాపారవేత్తలు హాజరయ్యారు.

# రేవంత్, జగన్ ఇద్దరూ కొత్తే.. కానీ పాలనలో మాత్రం!



హైదరాబాద్,తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తో. ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి భావ సారుప్యత ఉంది. ఎందుకంటే ముఖ్యమంత్రిగా ఎటువంటి పాలన అనుభవం లేకుండానే వీరు అధికారం చేపట్టారు. ఒక సాధారణ ఎమ్మెల్యేతో పాటు ఎంపీగా ఉన్న రేవంత్ నేరుగా సీఎం కుర్చీలోకి వచ్చారు. జగన్మోహన్ రెడ్డి సైతం కూడా అంతే. ఆయన సైతం ఎంపీ తో పాటు ఎమ్మెల్యేగా ఎన్నికైన అనుభవం మాత్రమే ఉంది. అయితే రేవంత్ కంటే జగన్ ప్రతిపక్ష నేత హోదా అనుభవం ఉంది. కానీ రేవంత్ ఆలోచనలు వేరు.. జగన్మోహన్ రెడ్డి ఆలోచనలు వేరు. అంతకుముందున్న టిఆర్ఎస్ ప్రభుత్వానికి మించి అభివృద్ధి చేయాలని చూస్తున్నారు రేవంత్ రెడ్డి. కానీ జగన్మోహన్ రెడ్డి అంతకు ముందున్న టిడిపి ప్రభుత్వ ఆనవాళ్లను చెరిపేయాలని చూశారు. ఇద్దరిలో అదే తేడా. అందర్నీ కలుపు కెళ్లే ప్రయత్నం చేస్తున్నారు రేవంత్ రెడ్డి. కానీ అప్పట్లో జగన్మోహన్ రెడ్డి సోలో పెర్ఫార్మెన్స్ చేశారు.

పెట్టుబడుల సదస్సుకు ఆహ్వానం..

తాజాగా తెలంగాణలో పెట్టుబడుల సదస్సును ఏర్పాటు చేశారు రేవంత్ రెడ్డి. ఏపీ సీఎం చంద్రబాబుకు సైతం ఆహ్వానం పంపారు. కానీ 2023లో గ్లోబల్ సమ్మిట్ పేరిట పెట్టుబడుల సదస్సు నిర్వహించిన జగన్మోహన్ రెడ్డి రేవంత్ రెడ్డికి ఆహ్వానించలేదు. ఎందుకంటే ఆయన తన రాజకీయ మిత్రుడు కేసిఆర్ కు శత్రువు కాబట్టి. కేవలం ఆ ఆలోచనతోనే తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డిని కనీసం గౌరవించలేదు. గౌరవభావంతో చూసిన దాఖలాలు కూడా లేవు. అప్పటి మాజీమంత్రి కొడాలి నాని సైతం రేవంత్ రెడ్డిని పలుచన చేస్తూ మాట్లాడేవారు. ఏదైనా ఉంటే తాము నేరుగా కాంగ్రెస్ హై కమాండ్ తో మాట్లాడుకుంటాం అంటూ చెప్పుకొచ్చేవారు.

కేవలం రాజకీయపరంగానే..

రేవంత్ రెడ్డి అలా కాదు. బిజెపిని రాజకీయపరంగా ప్రత్యర్థిగా చూస్తారే తప్ప.. పాలనాపరంగా ఎంతో గౌరవభావంతో చూస్తుంటారు. ఢిల్లీ వెళ్లి తరచూ ప్రధాని నరేంద్ర మోడీని కలుస్తుంటారు. తెలంగాణ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతుంటారు. పొరుగు రాష్ట్రాలతో సైతం సఖ్యతగా మెలుగుతారు. కానీ జగన్మోహన్ రెడ్డి రాజకీయ వైఖరిని అనుసరించి ఇతర రాష్ట్రాలతో స్నేహం చేస్తూ వచ్చారు. 2023 వరకు కేసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు జగన్ ఒకలా ఉండేవారు. చివరి ఏడాదిలో రేవంత్ సీఎం అయిన తర్వాత జగన్మోహన్ రెడ్డి వైఖరిలో చాలా మార్పు వచ్చింది. అప్పటివరకు మాటిమాటికి హైదరాబాద్ అనేవారు. ఎప్పుడైతే రేవంత్ అధికారంలోకి వచ్చారో హైదరాబాద్ అన్న మాట మరిచిపోయారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక బెంగళూరు రూట్ మార్చారు.

# మోదీ, షా సపోర్ట్ – రామ్మోహన్‌పై ఎన్ని కుట్రలు చేస్తే అంత బలోపేతం !



న్యూఢిల్లీ,కేంద్ర మంత్రి వర్గంలో అత్యంత పిన్నవయస్కుడైన మంత్రి రామ్మోహన్ నాయుడును ఆయన తప్పు లేకపోయినా టార్గెట్ చేసుకుంటున్న విపక్షాల తీరుతో ఆయన మరింత బలోపేతం అవుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. పార్లమెంట్ లో విపక్షాలు ఇండిగో సంక్షోభంపై రచ్చ చేసే ప్రయత్నం చేశాయి. కానీ రామ్మోహన్ నాయుడు ఒంటి చేత్తో సమర్థంగా ఎదుర్కొన్నారు. ఆయన ఇచ్చిన సమాధానానికి.. ఇతర పార్టీలు కూడా వంకలు పెట్టలేకపోయాయి. ఈ సమాధానం.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమిత్ షాలను మెప్పించింది. వారు స్వయంగా రామ్మోహన్ నాయుడుకు ఫోన్ చేసి సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కొన్నారని ప్రశంసించారు.సంక్షోభం బయటపడగానే వేగంగా స్పందించిన రామ్మోహన్ నాయుడు ఇండిగో వ్యవహారం దారి తప్పుతోందని తన మంత్రిత్వ శాఖకు తెలిసిన వెంటనే రామ్మోహన్ నాయుడు వెంటనే చర్యలు చేపట్టారు. ఫిర్యాదులు పెరుగుతున్న సమయంలోనే.. తన కార్యాలయంలో వార్ రూమ్ ను ఏర్పాటు చేశారు. కానీ ఇండిగో అసలు నిజాలను దాచిపెట్టింది. పరిస్థితి చేయి దాటి పోయే వరకూ బయటపడలేదు.ఈ కారణంగా ఐదు లక్షల మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అయితే రామ్మోహన్ నాయుడు వేగంగా స్పందించారు రీఫండ్ ను గంటల్లోనే ఇప్పించడంతో పాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడానికి ప్రయత్నించారు. పైలట్ల విషయంలో కొన్ని నిబంధనలు సడలించారు. అలాగే ఇతర సంస్థలు అదనపు సర్వీసులు నడిపేలా చేశారు. ఓ పెద్ద సంక్షోభాన్ని పూర్తిగా అధిగమించ లేకపోవచ్చు కానీ.. వీలైనంత వరకూ ఆయన సమర్థంగా ఎదుర్కొనే ప్రయత్నం చేశారు.

ఏకపక్షంగా రామ్మోహన్ పై దాడికి విపక్షం ప్రయత్నం

అక్కడ సమస్య ఏమిటో చాలా స్పష్టంగా అందరికీ తెలుసు. మంత్రిత్వ శాఖ పరిధిలో లేని ..ప్రైవేటు సంస్థ స్టాఫింగ్ వ్యవహారంతో సమస్య వచ్చింది. మిగతా ఏ ఎయిర్ లైన్స్ కు లేని సమస్య ఆ సంస్థకు వచ్చింది. అది పూర్తిగా స్వయం తప్పిదం. పైలట్ల నియామకం విషయంలో డీజీసీఏను కూడా తప్పుదోవ పట్టించారు. ఈ సమస్యకు..సంక్షోభానికి రామ్మోహన్ నాయుడు పనితీరుకు అసలు లింకే లేదు. అయినా మోదీ ప్రభుత్వం ఎక్కడ దొరుకుతుందో అని ఎదురు చూస్తున్న వారికి ఈ ఇండిగో సంక్షోభం దొరికింది. అంతే రాళ్లందుకున్నారు.విపక్షాలను ఎదుర్కోవడంలోనూ సమర్థత చూపిన రామ్మోహన్ నాయుడు తన తప్పు లేకపోయినా.. తమ మంత్రిత్వ శాఖ నిర్లక్ష్యం లేకపోయినా తనపై జరుగుతున్న ముప్పేట దాడిని రామ్మోహన్ నాయుడు సమర్థంగా ఎదుర్కొన్నారు. పార్లమెంట్ లోనే ఆయన ఇచ్చిన సమాధానానికి విపక్షాలు తప్పు పట్టలేకపోయాయి. అసలు రామ్మోహన్ నాయుడు చేసిన తప్పేమిటి.. విమానయాన మంత్రిత్వ శాఖ చేసిన తప్పేమిటో మాత్రం ఎవరూ చెప్పలేదు. ప్రయాణికుల భద్రత కోసం పైలట్ల విశ్రాంతి సమయం పెంచడమే సమస్య అయితే ఇతర ఎయిర్ లైన్స్ కు రాని సమస్య ఇండిగోకు ఎందుకు వస్తుంది?. ఈ ప్రశ్నకూ విపక్షాల వద్ద సమాధానం లేదు. రామ్మోహన్ నాయుడుకు ఎంతో భవిష్యత్ ఉంది. ఇలాంటి సవాళ్లు ఆయన సామర్థ్యాన్ని మరింతగా మెరుగుపరుస్తాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు

# మరోసారి ఇండిగో సీఈవో కీలక ప్రకటన!



న్యూఢిల్లీ,దేశంలో గత కొన్ని రోజులుగా ఇండిగో విమాన సంక్షోభంపై తీవ్ర చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ రోజు ఈ విషయం పార్లమెంట్ నూ కుదిపేసిన పరిస్థితి. అంతకంటే ముందు వేలాది మంది ప్రయాణికుల షెడ్యూల్ ను తలకిందులు చేసి, వారి పరిస్థితిని అతలాకుతలం చేసిన స్థితి! ఈ నేపథ్యంలో ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్ 'ఎక్స్' వేదికగా ఓ వీడియో విడుదల చేశారు.అవును... 2006లో ప్రారంభమైనప్పటి నుంచీ ఇప్పుడు అత్యంత దారుణమైన కార్యచరణ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఇండిగో.. సుమారు వారం రోజుల పాట గందరగోళం సృష్టించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా వందలాది విమానాలు రద్దు చేయబడి, వేలాది మంది ప్రయాణికులు నరకం చూసిన పరిస్థితి! ఈ సమయంలో తమ నెట్ వర్క్ అంతటా కార్యకలాపాలను పునరుద్ధరించినట్లు తెలిపింది.ఈ సందర్భంగా తాజాగా తమ నెట్ వర్క్ లో కార్యకలాపాలను పునరుద్ధరించామని ఇండిగో తెలిపింది. ఇదే క్రమంలో విమానాశ్రయాలలో చిక్కుకున్న సుమారు అన్ని బ్యాగులను తమ కస్టమర్లకు డెలివరీ చేశామని.. మిగిలిన వాటిని వీలైనంత త్వరగా డెలివరీ చేయనున్నామని.. సకాలంలో మా పనితీరు సాధారణ స్థాయికి చేరుకుందని ఎయిర్ లైన్ తెలిపింది. రద్దు తర్వాత రీఫండ్ విధానాన్ని ఆటోమేటెడ్ చేసినట్లు తెలిపింది.

ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్ మాట్లాడుతూ...!:

ఈ సందర్భంగా ఓ వీడియో సందేశం విడుదల చేసిన ఇండిగో సీఈఓ... ఇండిగో కార్యకలాపాలు స్థిరంగా ఉన్నాయని.. పెద్ద కార్యచరణ అంతరాయం సంభవించినప్పుడు మేము మిమ్మల్ని నిరాశపరిచామని.. అందుకు మేము చింతిస్తున్నామని తెలిపారు. ఆ సమయంలో మీలో వేలాది మంది ప్రయాణించలేకపోయారని.. మేము దాని గురించి తీవ్రంగా క్షమాపణలు కోరుతున్నామని అన్నారు.ఇదే క్రమంలో... ఇండిగో నెట్ వర్క్ విమానాల పునరుద్ధరణ యుద్ధ ప్రాతిపదికన జరుగుతోందని చెప్పిన పీటర్ ఎల్బర్స్... డిసెంబర్ 5న తాము 700 విమానాలు మాత్రమే నడపగా ఆ తర్వాత డిసెంబర్ 6న 1,500.. డిసెంబర్ 7న 1,650.. డిసెంబర్ 8న 1,800.. నేడు (డిసెంబర్ 9)న 1,800 కంటే ఎక్కువ విమానాలు నడపగలిగామని అన్నారు.ఇదే సమయంలో... తాము ప్రభుత్వంతో పూర్తి సహకారంతో పని చేస్తూనే ఉన్నామని చెప్పిన ఇండిగో సీఈఓ... ప్రస్తుతం తక్షణ సంక్షోభాన్ని పరిష్కరించామని.. అయితే, అందుకు దారి తీసిన విషయాలు, వాటి నుంచి నేర్చుకోవాల్సిన పాథాలపైనా అంతర్గతంగా దృష్టి పెట్టడం ప్రారంభించామని అన్నారు.

ఇండిగోకు విమానయాన శాఖ మంత్రి స్ట్రాంగ్ మెసేజ్!:

పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఈ రోజు ఎల్బర్స్ ను పిలిపించి, ఎయిర్ లైన్ కార్యచరణ స్థితి గురించి అడిగారని తెలుస్తోంది. ఆ భేటీలో ప్రయాణికుల సేఫ్టీ, అమౌంట్ రీఫండ్, ప్రయాణికుల లగేజ్ తిరిగి ఇచ్చే స్థితి గురించి చర్చించినట్లు తెలుస్తోంది.మరోవైపు.. ఇండిగో సంక్షోభం నేపథ్యంలో విమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడు.. లోక్ సభలో స్ట్రాంగ్ మెసేజ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇండిగో యాజమాన్యానికి డీజీసీఏ ఇప్పటికే షోకాజ్ నోటీసులు ఇచ్చిందని.. దర్యాప్తు కూడా ప్రారంభమైందని తెలిపారు. ఈ సందర్భంగా దర్యాప్తులో వెల్లడైన వివరాల ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ సందర్భంగా... ఎంత పెద్ద విమానయాన సంస్థ అయినప్పటికీ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని.. పౌర విమానయానంలో భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని ఆయన వెల్లడించారు.

నెట్టింట కొత్త చర్చ!:

దేశంలో ఇండిగో సంక్షోభం తీవ్ర చర్చనీయాంశంగా మారిన వేళ.. దేశ విమానయాన నెట్ వర్క్ లో ఇండిగో ఆదిపత్యం చర్చనీయాంశంగా మారిందని అంటున్నారు. ఈ సమయంలోనే ఒలిగోపోలి, డ్యూపోలి వంటి విషయాలు తెరపైకి వస్తున్నాయి. అందుకు కారణం.. భారతదేశ దేశీయ మార్కెట్లో 64.2 శాతం ఇండిగో నియంత్రణలో ఉండటమే!ఇలా వ్యవస్థలో ఎక్కువ భాగం ఒకే విమానయాన సంస్థపై ఆధారపడి ఉన్నప్పుడు.. దాని సమస్యలు అందరి సమస్యగా మారతాయనే విషయం ఇండిగో సంక్షోభంతో స్పష్టమైందని అంటున్నారు. ఇంత పెద్ద జనాభా ఉన్న దేశంలో అంత పెద్ద బాధ్యతను కలిగి ఉన్న సంస్థ ఇంత సంక్షోభం తర్వాత సారీ చెప్పడం కాకుండా.. సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త పడాలని సూచిస్తున్నారు.ఈ సంస్థ మార్కెట్లో అంత పెద్ద వాటాను కలిగి ఉండటం వల్ల.. ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలనుకున్నా, అంత సాహసం చేయలేవని, అది ప్రాక్టికల్ గా సాధ్యం కాదని ఈ సందర్భంగా పలువురు కామెంట్లు చేస్తున్నారు!

# తెలంగాణ టెన్త్ పరీక్షల షెడ్యూల్ విడుదల



హైదరాబాద్, తెలంగాణలో పదో తరగతి పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసింది. 2026 మార్చి నెల 14వ తేదీ నుంచి ఏప్రిల్ 16వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలంగాణ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ మంగళవారం అధికారికంగా ప్రకటించింది. పరీక్షల నిర్వహణకు సంబంధించి పూర్తి టైమ్‌టేబుల్‌ను విడుదల చేస్తూ, విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. వచ్చే ఏడాది మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు ఎస్ఎస్‌సీ బోర్డు షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 14న ఫస్ట్ లాంగ్వేజ్, 18న సెకెండ్ లాంగ్వేజ్, 23న ఇంగ్లీష్, 28న గణితం, ఏప్రిల్ 2న ఫిజిక్స్, ఏప్రిల్ 7న బయాలజీ, ఏప్రిల్ 13న సోషల్ స్టీడీస్ పరీక్షలు జరగనున్నాయి. ఏప్రిల్ 15న ఒకేషనల్ కోర్సు పేపర్–1 భాషా పీరీక్ష, ఏప్రిల్ 16న ఒకేషనల్ కోర్సు పేపర్–2 భాషా పరీక్ష జరగనుంది. ఈ షెడ్యూల్ ప్రకారం ప్రతి పరీక్షకు మధ్య మూడు రోజుల గ్యాప్‌ను కల్పించారు. దీని ద్వారా విద్యార్థులు ఒక పరీక్ష నుంచి మరో పరీక్షకు సమగ్రంగా సిద్ధమయ్యే అవకాశం ఉంటుందని బోర్డు పేర్కొంది. గతంలో ఒకటి లేదా రెండు రోజుల గ్యాప్‌తో పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, ఆ పరిస్థితిని దృష్టిలో ఉంచుకునే ఈసారి గ్యాప్‌ను పెంచామని అధికారులు వెల్లడించారు. మార్చి 14న మొదటి భాష పరీక్షతో ఎస్ఎస్‌సీ పరీక్షలు ప్రారంభమవుతాయి. ఆ తర్వాత రెండో భాష, మూడో భాష (ఆంగ్లం), గణితం, సైన్స్ (ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్), సామాజిక శాస్త్రం పరీక్షలు వరుసగా నిర్వహిస్తారు. ఏప్రిల్ 13న చివరిగా సోషల్ స్టడీస్ పరీక్షతో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగియనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఎక్కువ భాగం పరీక్షలు జరుగుతాయని బోర్డు స్పష్టం చేసింది. సైన్స్ అంశాలకు సంబంధించిన పరీక్షలకు నిర్ణీత సమయం కొద్దిగా భిన్నంగా ఉంటుందని అధికారులు తెలియజేశారు. వృత్తి విద్య (వొకేషనల్) విద్యార్థులు, ఓపెన్ స్కూల్ విద్యార్థులకు కూడా ఇదే షెడ్యూల్ వర్తిస్తుందని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని బోర్డు అధికారులు తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రశ్న పత్రాల గోప్యతకు ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అలాగే హాల్‌టికెట్ల పంపిణీ, పరీక్ష కేంద్రాల కేటాయింపును ముందుగానే పూర్తి చేస్తామని తెలిపారు. విద్యార్థులు పరీక్షల టైమ్‌టేబుల్‌ను గమనించి, ప్రణాళికబద్ధంగా చదువు కొనసాగించాలని అధికారులు సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించడమే లక్ష్యంగా ఈ షెడ్యూల్‌ను రూపొందించినట్లు బోర్డు స్పష్టం చేసింది.

# తెలంగాణలో చలి పంజా.. గణనీయంగా పెరిగిన చలి తీవ్రత



హైదరాబాద్,తెలంగాణలో చలి తీవ్రత గణనీయంగా పెరిగింది. కనిష్ట ఉష్ోగ్రతలు సాధారణం కంటే 3-4 డిగ్రీలు తగ్గాయి. రానున్న నాలుగు రోజులు చలి మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో అత్యల్పంగా 7.2 డిగ్రీల ఉష్ో?గ్రత నమోదైంది.దాదాపు అన్ని జిల్లాల్లో కనిష‘ ఉష్ో?గ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల మేర తగ్గాయి. ముఖ్యంగా సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో రహదారులపై దృశ్యత తగ్గి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిర్మల్ జిల్లా పెంబి మండలం చింతగూడకు చెందిన 60 ఏళ్ల వృద్ధుడు గంగారెడ్డి చలి తీవ్రతకు బలవ్వడం ఈ పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. రానున్న రోజుల్లో చలి ప్రభావం మరింత ఎక్కువ అవుతుందని చెప్పారు. ముఖ్యంగా వచ్చే నాలుగు రోజులు (డిసెంబర్ 10, 11, 12, 13) చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలోనే అత్యల్ప కనిష‘ ఉష్ో?గ్రత సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 7.2 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చలి ప్రభావం అధికంగా ఉన్నప్పటికీ, దక్షిణ తెలంగాణలోని కొన్ని జిల్లాల్లోనూ చలిగాలుల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈనెల 16 వరకు చలిగాలుల ప్రభావం తీవ్రంగా ఉంటుందని అంచనా వేశారు. ముఖ్యంగా జగిత్యాల, సంగారెడ్డి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, వికారాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సిద్ధిపేట, రంగారెడ్డి ఉన్నాయి. ముఖ్యంగా రాజధాని హైదరాబాద్ నగరంలోనూ చలి తీవ్రత పెరగనుందని, ఇక్కడ కనిష్ట ఉష్ో?గ్రతలు 9 డిగ్రీల సెల్సియస్ నుంచి 12 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతాయని అంచనా వేస్తున్నారు. వృద్ధులు, పిల్లలు తప్పనిసరిగా వెచ్చటి దుస్తులు ధరించాలని, అత్యవసరమైతే తప్ప ఉదయం, సాయంత్రం వేళల్లో బయటకు రాకుండా ఉండాలని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. ప్రజలు చలి నుంచి రక్షణ కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వెచ్చటి దుస్తులు ధరించాలని, వేడి వేడి భోజనం చేయాలని తెలిపారు.

# పంచాయితీ ఎన్నికల కోసం స్కూళ్లకు సెలవులు




హైదరాబాద్,ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి కొనసాగుతోంది. పంచాయతీ ఎన్నికల కారణంగా పాఠశాలలకు వరుస సెలవులు లభించనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పాఠశాలల్లో ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలుగా ఉన్న పాఠశాలలకు ఆరు రోజులపాటు సెలవులు రాబోతున్నాయి. దీంతో ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఏకంగా ఆరు రోజుల పాటు సెలవులు దొరకనున్నాయి. తొలి విడత పోలింగ్ సందర్భంగా డిసెంబర్ 10, 11 తేదీల్లో పాఠశాలలకు హాలిడేస్ ఇస్తున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఆదేశాలు కూడా జారీ చేశారు. ఇక రెండో విడత ఎన్నికల పోలింగ్ డిసెంబర్ 13, 14 తేదీల్లో జరగనున్నాయి. ఆ రెండు రోజులు రెండో శనివారం, ఆదివారం కావడంతో రెండు రోజులు కలిసి వచ్చాయి. మూడో విడత పోలింగ్ సందర్భంగా డిసెంబర్ 16, 17 తేదీల్లో పాఠశాలలకు హాలిడేస్ ప్రకటించారు. ఎందుకంటే పోలింగ్ సామగ్రిని సిద్ధం చేయడం, ఎన్నికల పక్రియ సజావుగా నిర్వహించడం కోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్, కార్మికులకు నెలవారి వేతనంతో కూడిన హాలిడే 11వ తేదీన ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఉత్తర్వు జారీ చేసింది. ఇదిలా ఉంటే.. డిసెంబర్ 25న క్రిస్మస్ పండగ, 26న బాక్సింగ్ డే, 28 ఆదివారం స్కూల్స్ కి సెలవులు రావడంతో విద్యార్థులు ఖుషీ ఖుషీగా ఉన్నట్లు తెలుస్తోంది.

# ఐఏఎస్ అమ్రపాలి -తెలంగాణ ప్రయత్నాలు మళ్లీ ఫెయిల్ !



న్యూఢిల్లీ,ఏపీ క్యాడర్ లో పని చేస్తున్న ఐఏఎస్ అధికారి అమ్రపాలి తెలంగాణ క్యాడర్ కు వెళ్లేందుకు చేసిన ప్రయత్నాలు మరోసారి విఫలమయ్యాయి..హరికిరణ్ అనే తెలంగాణ ఐఏఎస్ అధికారిని స్వాపింగ్ ద్వారా ఏపీకి వచ్చి ఆ ప్లేస్‌లో తాను వెళ్లడానికి గతంలో క్యాట్ ఉత్తర్వులు తెచ్చుకున్నారు. కానీ డీవోపీటీ ఆ ఉత్తర్వులపై హైకోర్టుకు వెళ్లింది దీంతో హైకోర్టు ఆ ఉత్తర్వులపై స్టే ఇచ్చింది. తదుపరి విచారణ ఆరు వారాలకు వాయిదా వేసింది.కాట అమ్రపాలి ఉమ్మడి రాష్ట్రంలో ఐఏఎస్ అయ్యారు. ఏపీ క్యాడర్ కు కేటాయించారు. రాష్ట్ర విభజన తర్వాత ఆమె హొంటౌన్ విశాఖపట్నం కావడంతో ఏపీకి కేటాయించారు. కానీ సివిల్స్ పరీక్ష అప్లికేషన్ లో అలా పెట్టాను కాను తాను చదువుకున్నదంతా హైదరాబాదేనని.. తెలంగాణకు కేటాయించాలని ఆమె అప్పీల్ చేసుకున్నారు. తెలంగాణలోనే పని చేశారు. వరంగల్ కలెక్టర్ గా పని చేశారు. కేంద్ర సర్వీసులకు వెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రేవంత్ హయాంలో గ్రేటర్ కమిషనర్ గా.. హెచ్ఎండీఏ అదనపు బాధ్యతలు కూడా చూసుకున్నారు. కానీ ఆమె ఏపీకి వెళ్లాల్సిందేనని డీవోపీటీ తేల్చడంతో తెలంగాణలో రిలీవ్ అయి ఏపీ క్యాడర్ కు వెళ్లారు. అక్కడ టూరిజం శాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు.అయితే ఆ తర్వాత కూడా ఆమె ప్రయత్నాలు చేస్తున్నారు. ఏపీకి వచ్చేందుకు ఆసక్తితో ఉన్న హరికిరణ్ అనే ఐఏఎస్‌తో ఒప్పందం చేసుకున్నారు వారిద్దరూ.. క్యాడర్లు మారాలనుకుని దరఖాస్తు చేసుకున్నారు. దానికి క్యాట్ అంగీకరించింది. కానీ హరికిరణ్.. రిజర్వుడు కేటగిరి అని.. అలా సాధ్యం కాదని డీవోపీటీ కోర్టుకెళ్లింది. దీంతో మళ్లీ నిరాశ తప్పలేదు. గతంలో క్యాట్ అనుమతి ఇచ్చినా.. ఇప్పటి వరకూ అమ్రపాలి ఏపీలో రిలీవ్ కాలేదు. ఇప్పటికీ ఏపీ సర్వీస్‌లోనే ఉన్నారు.

## ముగింపు వేడుకల్లో ఆకట్టుకున్న డ్రోన్ షో

హైదరాబాద్,తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రైజింగ్ గ్లోబల్ సమిట్ ముగింపు వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన భారీ డ్రోన్ షో అందరిని ఆకట్టుకుంది. తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ లక్ష్యాలను వివరించే థీమ్‌లతో డ్రోన్ షో ఏర్పాటు చేశారు. గిన్నిస్ బుక్ రికార్డు సాధించేలా 3 వేల డ్రోన్‌లతో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. గతంలో అబుదాబిలో డ్రోన్ల ప్రదర్శనను మించి దీనిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన గిన్నిస్ వరల్డ్ రికార్డు సభ్యులు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి ధృవపత్రాన్ని అందజేశారు. ఈ సమ్మిట్ 2025 ముగింపు వేడుకల్లో భారీగా బాణసంచా

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com